



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 75 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 08 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




## పవన్ కల్యాణ్‌కు

# 'అభినవ కృష్ణ దేవరాయ' బిరుదు

- ఉడుపి పుట్టిగే మఠంలో బిరుదు ప్రదానం చేసిన పీఠాధిపతి
- పీఠాధిపతి సుగుణేంద్ర స్వామీజీ చేతుల మీదుగా సత్కారం
- రాష్ట్ర ప్రయోజనాల కోసమే 21 స్థానాల్లో పోటీ చేశానన్న పవన్
- భగవద్గీత ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శి అని వ్యాఖ్య
- ధర్మ స్థాపనకే తన రాజకీయ ప్రస్థానమని స్పష్టీకరణ

**ఉడుపి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అరుదైన గౌరవం లభించింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉడుపిలో ఆయనకు 'అభినవ కృష్ణ దేవరాయ' అనే బిరుదును ప్రదానం చేశారు. కర్ణాటకలోని ఉడుపి పర్యాయ పుట్టిగే శ్రీకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్వహించిన బృహత్ గీతోత్సవ కార్యక్రమంలో మఠాధిపతి శ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామీజీ మిగతా 2

## నీటి కుంటలో పడి

# అన్నదమ్ముల మృతి



**కళ్యాణదుర్గం గ్రామీణం, బ్రహ్మసముద్రం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఇద్దరు అన్నదమ్ములు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు మిగతా 2

## హైదరాబాద్‌లోని రోడ్డుకు

# ట్రంప్ పేరు..

### కేంద్రానికి లేఖ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని కీలక రోడ్లకు ప్రముఖ వ్యక్తులు, సంస్థల పేర్లు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అవుటర్ రింగ్ రోడ్డు వద్ద రావిర్యాల నుంచి మిగతా 2

## ప్రవాసాంధ్రులను

# గుండెల్లో పెట్టుకుంటా..

### డాలస్‌లో మంత్రి నారా లోకేష్



**డాలస్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగువాళ్లు దశాబ్దాల క్రితమే అమెరికాకు వచ్చారని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. డాలస్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పొరా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. "అమెరికాలో తెలుగువాళ్లు సత్తా చాటారు. మాకు అండగా నిలిచిన ప్రవాసాంధ్రులను గుండెల్లో పెట్టుకుంటాం. కష్టకాలంలో మీరంతా మా కుటుంబానికి అండగా నిలిచారు. స్పీడ్‌కు ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్‌గా మారింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. వాళ్లు వై నాట్ మిగతా 2

## అయ్యగారు అద్దెకున్న ఇంట్లోనే

# 30 లక్షలు.. పెద్దఅనకొండే...



**విశ్వం వాయిస్ న్యూస్ :** హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి ఏసీబీకి అడ్డంగా బుక్కయ్యాడు.. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోనే 60 వేల రూపాయలు లంచం తీసుకుంటూ పట్టుబడటం కలకలం రేపుతోంది.. రేపో మాపో ఐఏఎస్ అర్హత పొందబోతున్న ఆ అధికారి లంచం తీసుకుంటూ పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో అదనపు కలెక్టర్‌తో పాటు మరో ఇద్దరు విద్యాశాఖ మిగతా 2




## కడప నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు

# నోటిఫికేషన్

### 11న ప్రత్యేక సమావేశం

**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** కడప నగరపాలక సంస్థ మేయర్ ఎన్నిక కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదితి సింగ్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 11న ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ రెండు రోజుల కిందటే కడప మేయర్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో.. ఇవాళ జాయింట్ కలెక్టర్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇటీవలే వైకాపా నేత సురేష్ బాబును మేయర్ పదవి నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అవినీతి అక్రమాల మిగతా 2

## నిన్నటి వరకు ఒక లెక్క..

# గ్లోబల్ సమిట్ తర్వాత మరో లెక్క..

### తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు.. ముఖ్యమంత్రిగా తనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. జాతి కోసం.. జనహితం కోసం.. కలలు కనాలంటే ధైర్యం, గొప్ప కార్యాలు చేయాలంటే మహా సంకల్పం కావాలంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సరిగ్గా రెండేళ్ల క్రితం తనకు ధైర్యమిచ్చి ఓటుతో ఆశీర్వదించిన నాలుగు కోట్ల ప్రజలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. రెండేళ్ల ప్రస్థానంలో అహర్నిశలూ అవనిపై తెలంగాణను శిఖరాగ్రాన నిలిపేందుకు తపనతో శ్రమించినట్లు పేర్కొన్నారు. గత పాలన శిథిలాల కింద కొనఊపిరితో ఉన్న నవతరానికి కొలువుల జాతరతో కొత్త ఊపిరి పోసినట్లు సీఎం పేర్కొన్నారు.

**ఈ పథకాలు.. రెండేళ్ల సంక్షేమ చరిత్రకు సాక్ష్యాలు**

రుణభారంతో వెన్ను విరిగిన రైతుకు దన్నుగా నిలిచి దేశానికే ఆదర్శంగా నిలిపామన్నారు. "ఆడబిడ్డల ఆకాంక్షలకు ఆర్థిక మద్ధతు ఇచ్చి అదానీ, అంబానీల్లా వ్యాపార రంగంలో నిలిపాం. బలహీనవర్గాల వందేళ్ల ఆకాంక్షలను కుల లెక్కలతో కొత్త మలుపులు తిప్పాం. వర్గీకరణతో మాదిగ సోదరుల ఉద్యమానికి నిజమైన సార్థకత చేశాం. చదువొక్కటే బతుకు తెరువుకు బ్రహ్మాస్త్రమని నమ్మి.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణ యజ్ఞానికి పునాదులు వేశాం. స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీలకు శ్రీకారం చుట్టాం. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం మూల సిద్ధాంతంగా ముందుకు సాగుతున్నాం. 'జయ జయహే తెలంగాణ' అన్న ప్రజాకవి అందెశ్రీ గేయానికి, జన ఆకాంక్షల మేరకు అధికారిక గుర్తింపు ఇచ్చి గౌరవించాం. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డలకు ఉచిత బస్సు పథకం, 500 రూపాయలకే గ్యాస్, మిగతా 2

## షాంఘైలో కొత్త భవనంలోకి

# భారత కాన్సులేట్



**విశ్వం వాయిస్ న్యూస్ :** చైనాలోని షాంఘైలో భారత కాన్సులేట్ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. ఆ దేశంలో ప్రధాన వాణిజ్య కేంద్రం ప్రాంతంలోకి మారడం మూడు దశాబ్దాల్లో ఇదే తొలిసారి. చాంగ్‌నింగ్ జిల్లాలోని ప్రముఖ డానింగ్ సెంటర్‌లో ఉన్న అత్యాధునిక చాన్సరీ బిల్డింగ్‌లో 1436 చ.మీ విస్తీర్ణంలో ఉన్న కాన్సులేట్ కేంద్రాన్ని చైనాలోని భారత రాయబారి ప్రదీప్ కుమార్ రావత్ ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ అధికారులు, విదేశీ దౌత్యవేత్తలు, భారత ప్రతినిధులు సహా దాదాపు 400 మంది ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. చైనా తూర్పు ప్రాంతంలో భారత్‌కు చెందిన అనేక వ్యాపార సంస్థలున్నాయి. ఇక్కడి వారికి ఈ షాంఘై కాన్సులేట్ సేవలందించనుంది. 1992 నుంచి మిగతా 2

## గోవా నైట్‌క్లబ్‌లో

# ఘోర అగ్నిప్రమాదం, 25 మంది మృతి

- అక్రమ నిర్మాణం, ఇరుకైన దారులే ప్రమాదానికి కారణమా?
- ఘటనా స్థలానికి ఆలస్యంగా చేరుకున్న అగ్నిమాపక శకటాలు
- గతంలోనే కూల్చివేత నోటీసులు జారీ చేసిన పంచాయతీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** గోవాలోని ఓ నైట్‌క్లబ్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 25 మంది సజీవ దహనమయ్యారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అయితే, ఈ ఘోర విషాదానికి క్లబ్ యాజమాన్యం నిర్లక్ష్యం, అక్రమ నిర్మాణం, ఇరుకైన దారులే ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. పంచాయతీ అధికారులు గతంలోనే మిగతా 2

## ఎమ్మెల్సీ మర్రి ప్రోటోకాల్‌పై

# జరుగుతున్న చర్చ...

### అసహనం వ్యక్తం చేస్తున్న నాయకులు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణంలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం అధికారులు, నాయకుల కనుసనల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ నెల 5వ తేదీన పాల్గొన్నారు. ఒకరోజు ముందు నుంచే అధికారిక ప్రకటన వెలువడించారు. అధికారులు, నాయకులు హడావుడిగా ఏర్పాట్లు పరిశీలన మిగతా 2

## తిరుపతిలో బీఈడీ విద్యార్థినిపై

# ప్రొఫెసర్ లైంగిక దాడి

- గర్భం దాల్చిన బాధితురాలు!
- సంస్కృత వర్సిటీలో ఘటన



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బీఈడీ విద్యార్థినిపై ఓ ఆచార్యుడు లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితురాలు గర్భం దాల్చగా, ఆమెను బెదిరించి సొంత రాష్ట్రానికి పంపించినట్లు సమాచారం. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు వర్సిటీలో ఓ విద్యార్థినిని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణకుమార్ కొంతకాలంగా లైంగికంగా వేధించారు. మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ శేఖర్‌రెడ్డి వీడియో తీసి ఆమెను లైంగికంగా వేధించేందుకు యత్నించారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి వీసీ రజనీకాంత్ శుక్లా తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇద్దరు ఆచార్యుల సెల్‌ఫోన్లను సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు మిగతా 2

(మొదటిపేజీ తరువాయి)

# పవన్ కల్యాణ్‌కు 'అభినవ కృష్ణ దేవరాయ' బిరుదు

ఈ బిరుదును పవన్ కల్యాణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, భగవద్గీత ప్రాముఖ్యత, ధర్మం, తన రాజకీయ ప్రయాణం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమానికి తాను ఉప ముఖ్యమంత్రిగానో, ప్రజాసేవకుడిగానో రాలేదని, ధర్మాన్ని అన్వేషించే ఒక వినయపూర్వక సాధకుడిగా మాత్రమే వచ్చానని పవన్ స్పష్టం చేశారు. సరైన పాలన, సేవ, బాధ్యతలతో కూడిన ప్రతి చర్యే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ముందు తాను కూడా అర్జునుడిలాంటి సందిగ్ధతను ఎదుర్కొన్నానని గుర్తుచేసుకున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే రాష్ట్ర సమగ్ర శ్రేయస్సే ముఖ్యమని, ధర్మాన్ని అనుసరించే కేవలం 21 స్థానాలకే పరిమితమయ్యానని వివరించారు. భగవద్గీత అనేది కేవలం ఒకసారి చదివి, ఎర్ర వస్త్రంలో చుట్టి పూజాగదిలో పెట్టే గ్రంథం కాదని పవన్ అన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి నిర్ణయంలో, ప్రతి గందరగోళంలో, ప్రతి అంతర్గత పోరాటంలో గీత మనతోనే నడుస్తుందని, మన కురుక్షేత్రాల్లో స్థిరమైన తోడుగా నిలుస్తుందని తెలిపారు. నేటి తరం యువత నిరంతరం సమాచార వెల్లువ, కెరీర్ ఒత్తిడి, గుర్తింపు సంక్షోభం, వైఫల్య భయాలు వంటి ఆధునిక కురుక్షేత్రాలను ఎదుర్కొంటోందని, వారికి అత్యంత అవసరమైన మానసిక బలం, భావోద్వేగ నిలకడను గీత అందిస్తుందని అభిప్రాయపడ్డారు. మన కర్మభూమి ఎన్నో దండయాత్రలను తట్టుకుని నిలబడింది ఆయుధాలు లేదా సంపదతో కాదని, ధర్మాన్ని సజీవంగా ఉంచిన గ్రంథాలు, సంప్రదాయాలు, సాధువులు, పవిత్ర సంస్థల వల్లేనని పవన్ ఉద్ఘాటించారు. ఐన్‌స్టీన్ నుంచి ఓపెన్‌హైమర్ వరకు ఎందరో ప్రపంచ మేధావుల ఆలోచనలను గీత శతాబ్దాలుగా ప్రభావితం చేస్తోందని గుర్తు చేశారు. ఉడిపి వంటి పుణ్యక్షేత్రాల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు సమావేశమైనప్పుడు 'వసుధైక కుటుంబం' అనే ప్రాచీన భారతీయ దార్శనికతకు జీవం పోస్తారని, ఇదే నేడు ప్రపంచానికి భారత్ అందిస్తున్న సందేశమని వివరించారు. జగద్గురు మధ్వాచార్యుల శాశ్వత వారసత్వం ద్వారా మన ఆధ్యాత్మిక సంపదను కాపాడిన వారిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు.

## నీటి కుంటలో పడి అన్నదమ్ముల మృతి

వెల్లడించిన వివరాల ప్రకారం.. కళ్యాణదుర్గం పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో నివాసం ఉంటున్న నరేంద్ర (32), చరణ్ (25) స్థానిక పాల వెంకటాపురం గ్రామ శివారులోని మామిడితోటలో ఉన్న నీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు, మరికొందరు కూలీలతో కలిసి మామిడి చెట్లకు పురుగుమందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. వారంతా పనిలో ఉండగా.. అన్నదమ్ములిద్దరూ నీటి కుంట వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో తమ్ముడు చరణ్ కాలుజారి నీటిలో పడగా.. అతడిని కాపాడేందుకు వెళ్లిన అన్న కూడా మునిగిపోయాడు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో ఊపిరి ఆడక ప్రాణాలు కోల్పోయారు. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో సమీపంలో గాలించగా.. నీటికుంటలో మృతదేహాలు కనిపించాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకేసారి ఇద్దరు అన్నదమ్ములు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## హైదరాబాద్‌లోని రోడ్డుకు ట్రంప్ పేరు..

ఫ్యూచర్ సిటీ వరకు వంద మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు రతన్ టాటా పేరు పెట్టాలని నిర్ణయించారు. రావిర్యాల ఇంటర్ ఛేంజ్‌కు ఇప్పటికే టాటా ఇంటర్‌చేంజ్ అని పేరు పెట్టారు. ప్రపంచంలోనే తొలిసారిగా ఓ రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ అని పేరు పెట్టాలని ప్రభుత్వం ప్రతిపాదన సిద్ధం చేసింది. తుది నిర్ణయం కోసం కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి ప్రభుత్వం లేఖలు రాయనుంది. ఐటీ కారిడార్‌లో ముఖ్యమైన రోడ్లకు గూగుల్ స్ట్రీట్, మైక్రోసాఫ్ట్ రోడ్, విప్రో జంక్షన్ పేర్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితవ్యక్తులు, ప్రముఖ కంపెనీల పేర్లను రహదారులకు పెట్టడం ద్వారా వారికి సముచిత గౌరవం ఇవ్వటంతో పాటు, హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. ఆ రోడ్లపై ప్రయాణించే వారికి కూడా స్ఫూర్తిమంతంగా ఉంటుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదన చేశారు.

### ప్రవాసాంధ్రులను

## గుండెల్లో పెట్టుకుంటా..

175 అన్నారు.. ప్రజలు మాత్రం వై నాట్ 11 అన్నారు. ప్రవాసాంధ్రులకు ఏ కష్టం వచ్చినా ఏపీఎన్ఆర్టీ అండగా ఉంటుంది. విడాకులు, మిస్ ఫైర్‌లు, క్రాస్ ఫైర్‌లు లేకుండా ఎన్డీయే కూటమి మరో 15 ఏళ్లు రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్తుంది. రెడ్‌బుక్ తన పని తాను చేసుకుపోతోంది. చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదిలిపెట్టేది లేదు. మేం ఎలాంటి కక్షసాధింపులకు పాల్పడటం లేదు. చంద్రబాబుని 53 రోజులు పాటు అక్రమంగా జైలులో ఉంచినప్పుడు అమెరికాలోని ప్రవాసాంధ్రులు పెద్దఎత్తున బయటకు వచ్చి మాకు అండగా నిలిచారు. 2019 నుంచి 2024 వరకు ఎంతటి విధ్వంస పాలన జరిగిందో అందరికీ తెలుసు. అందుకే సిద్ధం సిద్ధం అని బయలుదేరిన పార్టీని ప్రజలు భూస్థాపితం చేశారు. ప్రవాసాంధ్రుల మద్దతుతో కూటమి సూపర్ హిట్ అయింది. రాబోయే రోజుల్లో రికార్డులు కూడా తిరగరాస్తాం. దేశంలో అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్‌లు ఉంటే.. ఒక్క ఏపీలోనే డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. ఒకే రాష్ట్రం–ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. రాష్ట్రంలో మరో పదిహేనేళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం ఖాయం" అని లోకేశ్ అన్నారు.

## 30 లక్షలు.. పెద్దఅనకొండే...

అధికారులు అరెస్టయ్యారు.. అయ్యగారి పాపాలలో పాలు పంచుకొని జైలు పాలయ్యారు. ఓ ప్రైవేట్ స్కూల్ పర్మిషన్ రెన్యువల్ చేసేందుకు.. యాజమన్యం నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు.. వెంకట్ రెడ్డి ప్రస్తుతం హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారిగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ స్కూల్ రెన్యువల్ కోసం లంచం డిమాండ్ చేసి రూ. 60 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు తన ఛాంబర్‌లోనే పట్టుకున్నారు. ఆయనతో పాటు గౌస్, మనోజ్ అనే మరో ఇద్దరు విద్యాశాఖ సిబ్బందిని కూడా పట్టుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలోనే హనుమకొండలోని చైతన్యపురి కాలనీలో ఆయన నివాసం ఉంటున్న అద్దె ఇంట్లో 30 లక్షల రూపాయల కరెన్సీ లభ్యం అయింది. ఆ డబ్బుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశారు.. హైదరాబాద్‌లోని తన నివాసంలో విలువైన భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అదనపు కలెక్టర్ వెంకటరెడ్డిపైన గతంలో కూడా పలు కేసులు నమోదు అయ్యాయి. ఆదాయానికి మించి అక్రమాస్తులు కలిగి ఉన్నాడనే ఆరోపణల పైన కేసులు ఉన్నాయనీ ఏసీబీ అధికారులు తెలిపారు.. నల్గొండ జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో ఈయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది.. జనగామ %=ఖా% గా విధులు నిర్వహిస్తున్న క్రమంలో జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు విషయంలో కూడా అవినీతి కి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. సీసీ కెమెరాలు లేకుండా చూసి లంచం తీసుకున్నాడు. అయినా ఏసీబీ అధికారుల నుండి తప్పించుకోలేకపోయాడు. పక్కా ప్లాన్ ప్రకారం లంచం తీసుకున్నాడు. పగడ్బందీగా దొరికారు. అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి అడ్డంగా బుక్కై అరెస్ట్ అవడంతో ఆయన బాధితులు సంబరాలు జరుపుకున్నారు.. ఊరుకొండ, ఆరేపల్లి, వంగపహాడ్ గ్రీన్ ఫీల్డ్ హైవే బాధితులు హన్మకొండ కలెక్టరేట్ ముందు టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు.

## కడప నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్

ఆరోపణలు ఎదుర్కొంటున్న సురేష్ బాబును పదవి నుంచి తొలగించింది. డిప్యూటీ మేయర్‌గా ఉన్న ముంతాజ్ బేగంను నియమించారు. అయితే, మరో 5 నెలల్లో పాలకవర్గం పదవీకాలం గడువు ముగుస్తున్న నేపథ్యంలో నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయటానికి తీర్మానాలు తప్పనిసరి అని భావించిన నేపథ్యంలో మేయర్ ఎన్నిక అనివార్యమైంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్.. మేయర్ పదవి కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే.. ఎన్నికల కమిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ పై సురేష్ బాబు హైకోర్టులో శుక్రవారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన వేసిన పిటిషన్ పైన ఈనెల 9న హైకోర్టు విచారణ జరపనుంది.

## గ్లోబల్ సమిట్ తర్వాత మరో లెక్క..

సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే గొప్ప పథకాలన్నీ ఈ రెండేళ్ల సంక్షేమ చరిత్రకు సాక్ష్యాలు.

**ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క**

స్వతంత్ర భారత ప్రయాణం వందేళ్ల మైలురాయికి చేరే 2047 నాటికి మన తెలంగాణ ఎట్లుండాలి.. ఎక్కడ ఉండాలో లోతైన మథనంతో మార్గదర్శక పత్రం సిద్ధం చేశాం. గత పాలకులు కలలో కూడా ఊహించని విజన్‌కు ప్రాణం పోశాం. ప్రపంచ వేదికపై తెలంగాణ రైజింగ్ రీ సౌండ్ చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. భారతదేశ గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణను మార్చడానికి సర్వం సిద్ధం చేశాం. భారత్ ఫ్యూచర్ సిటీ రేపటి తెలంగాణ ప్రగతికి వేగుచుక్క. నిన్నటి వరకు ఒక లెక్క.. రేపటి తెలంగాణ గ్లోబల్ సమిట్ తర్వాత మరో లెక్క. నిన్న, నేడు, రేపు ప్రజల ఆశీర్వాదమే ఆయుధం.. ప్రేమాభిమానాలే సర్వం.. సహకారమే సమస్తం. తెలంగాణ ప్రజలు తోడుగా ఉన్నంత వరకు గొంతులో ఊపిరి ఉన్నంత వరకు%ౌ% తెలంగాణ రైజింగ్‌కు తిరుగు లేదు. అందరికీ ప్రజా పాలన రెండేళ్ల విజయోత్సవ శుభాకాంక్షలు" అని సీఎం తెలిపారు.

## షాంఘైలో కొత్త భవనంలోకి భారత కాన్సులేట్

షాంఘై ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్‌లో ఈ కార్యాలయం కొనసాగుతోంది. ప్రస్తుత కార్యాలయం పాతదానికంటే రెట్టింపు విస్తీర్ణంలో ఉందని అధికారులు వెల్లడించారు. భారత్ విదేశాంగశాఖ, స్థానిక అధికారులకు షాంఘైలోని భారత కాన్సులర్ జనరల్ ప్రతీక్ మథ్యూర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

## ఘోర అగ్నిప్రమాదం, 25 మంది మృతి

కూల్చివేత నోటీసులు ఇచ్చినా, వాటిని బేఖాతరు చేసి క్లబ్ నిర్వహించడమే మరణాల తీవ్రతకు దారితీసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనాజీకి 25 కిలోమీటర్ల దూరంలోని అర్పొర గ్రామంలో ఉన్న 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్‌లో శనివారం తెల్లవారుజామున 1 గంట సమయంలో ఈ ప్రమాదం జరిగింది. 'బాలీవుడ్ బ్యాంగర్ నైట్' జరుగుతున్న సమయంలో సుమారు 100 మంది క్లబ్‌లో ఉన్నారు. డ్యాన్స్ ఫ్లోర్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. కొందరు బయటకు పరుగులు తీయగా, ప్రాణాలు కాపాడుకునేందుకు మరికొందరు కింద ఉన్న వంటగదిలోకి వెళ్లారు. కానీ అదే వారికి మృత్యుద్వారంగా మారింది. దట్టమైన పొగ కమ్ముకోవడంతో ఊపిరాడక క్లబ్ సిబ్బందితో పాటు పర్యాటకులు అక్కడే ప్రాణాలు విడిచారు.

**ఇరుకైన దారి, తాటాకులతో నిర్మాణాలు..!**

ఈ క్లబ్‌కు వెళ్లే దారి చాలా ఇరుకుగా ఉండటంతో అగ్నిమాపక శకటాలు ఘటనా స్థలానికి సుమారు 400 మీటర్ల దూరంలోనే నిలిచిపోయాయి. దీంతో సహాయక చర్యలు ఆలస్యమయ్యాయని ఫైర్ ఆఫీసర్ ఒకరు తెలిపారు. తాత్కాలికంగా తాటాకులతో నిర్మించిన కట్టడాలు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయని హైదరాబాద్‌కు చెందిన ప్రత్యక్ష సాక్షి ఫాతిమా షేక్ తెలిపారు. మరోవైపు, ఈ క్లబ్ నిర్మాణం పూర్తిగా అక్రమమని, భాగస్వాముల మధ్య వివాదాలు కూడా ఉన్నాయని అర్పొర–నగోవా సర్పంచ్ రోషన్ రెడ్కర్ వెల్లడించారు. తాము కూల్చివేత నోటీసులు జారీ చేసినా, పంచాయతీ డైరెక్టరేట్ అధికారులు ఆ చర్యలను నిలిపివేశారని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోవాకు ఇది అత్యంత బాధాకరమైన రోజని పేర్కొన్న సీఎం ప్రమోద్ సావంత్, ఘటనపై విచారణకు ఆదేశించారు. మృతుల్లో పర్యాటకులు, క్లబ్ సిబ్బంది ఉండగా, కొన్ని మృతదేహాలను ఇంకా గుర్తించాల్సి ఉంది.

## ఎమ్మెల్సీ మర్రి ప్రోటోకాల్‌పై జరుగుతున్న చర్చ...

సైతం చేశారు. ఇదంతా బాగున్నప్పటికీ పల్నాడు జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ మర్రిరాజశేఖర్‌ను ప్రోటోకాల్ విషయంలో మర్చిపోవడంతో జిల్లాలో తీవ్రమైన చర్చ జరుగుతుంది. రాష్ట్ర డిప్యూటీ సీఎం చిలకలూరిపేట వచ్చినప్పుడు తెలియజేయాల్సిన నైతిక బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ మర్రి ని పిలవకపోవడంతో మర్రి అభిమానులు తీవ్ర ఆగ్రహ ఆవేశాలకు లోనవుతున్నారు. తమ నాయకుడు పార్టీ మారినప్పటికీ పరాభవం తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఏవరు చెబితే తమ నాయకుని పిలవలేదో జిల్లా అధికారులు సమాధానం చెప్పవలసి ఉందని, ఈ వివక్షత ఏమిటని పలు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఈ విషయమై కొంతమంది నాయకులు మర్రి వద్ద ప్రస్తావిస్తే సమయం వచ్చినప్పుడు తేల్చుకోవాల్సి ఉందని, దీనిపైన ఎవరు మాట్లాడవద్దన్నారు. ఈ విషయం కొంతమంది నాయకుల ద్వారా విశ్వసనీయ సమాచార మేరకు తెలుస్తుంది. ఏది ఏమైనాప్పటికీ రానున్న రోజుల్లో జరిగే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గే అవకాశాలు ఉన్నాయని పలువురు నాయకులు చర్చించుకుంటున్నారు. ప్రోటోకాల్ పై జిల్లా అధికారులు దీనిపైన ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

### తిరుపతిలో బీఈడీ విద్యార్థినిపై

## ప్రొఫెసర్ లైంగిక దాడి

సీఐ మురళీమోహన్ తెలిపారు.

**విద్యార్థుల ఆరోపణ:** ఈ ఘటనపై బాధిత విద్యార్థిని పది రోజుల కిందటే వీసీ కృష్ణమూర్తికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దాంతో లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణకుమార్‌ను ఈ నెల 1న సస్పెండ్ చేశారని, 2 నుంచి ఆయన విధులకు రావట్లేదని వర్సిటీ విద్యార్థులు చెబుతున్నారు. ఈయనపై విచారణకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ)ని సైతం వర్సిటీ నియమించినట్లు తెలిసింది.

## నాపై జగన్ దుష్ప్రచారం చేస్తున్నారు

### ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి




**నెల్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అప్పన్న కుటుంబానికి తాను సేవా భావంతో రూ.50 వేల చెక్కు ఇచ్చానని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సీఎం జగన్ తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి మాట్లాడారు. "వైఎస్ జగన్ నాపై అనవసరంగా కామెంట్స్ చేశారు. తానేంటో ఆయన ఆత్మకే వదిలేస్తున్నా. ఎవరు చెబితే నేను సాయం చేశానో తెలియదా? వైవీ సుబ్బారెడ్డి వద్ద పనిచేస్తున్న అప్పన్నకు నేను సాయం చేశాను. ఆయన మాట్లాడే విషయాలు సత్యమా, కాదా అనేది దేవుడి ఎదుట ప్రమాణం చేయాలి. సాయం కోసం ఎవరైనా అడిగితే ఇప్పటికీ చాలా మందిని ఆదుకుంటున్నా. ప్రతి నెలా నేను సాయం చేసే జాబితాలో చాలామంది ఉంటారు. ఈ విషయాలు ఆయనకు కూడా తెలుసు. ఎవరు చెబితే ఇచ్చానో వారికి ఈ విషయం తెలుసు. అసలు నాపై అలాంటి మాటలు మాట్లాడాల్సిన అవసరమే లేదు. సేవాభావంతోనే నేను సాయం చేస్తుంటా, సేవ చేయడం కూడా ఒక్కోసారి తప్పవుతోంది. నిందలు మోయాల్సి వస్తోంది. ఎంత చేశామో, ఎవరికి చేశామో, మనం చేసే మంచేంటో దేవుడికే తెలుసు. జగన్ మాటలు బాధ కలిగించాయి కాబట్టే ఇప్పుడు చెబుతున్నా" అని వేమిరెడ్డి పేర్కొన్నారు.

### గులాబీ జెండా పోయి చేయి గుర్తు వచ్చినా..

## దోపిడీ ఆగలేదు

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పదేళ్ల భారత రాష్ట్ర సమితి పాలనలో తెలంగాణ అప్పుల పాలైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద భాజపా ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. రెండేళ్ల కాంగ్రెస్ నయవంచన పాలన పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో నెరవేర్చని హామీలను పేర్కొంటూ ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ నియంత పాలన, కుటుంబ పాలన చూశామన్నారు. వారి హయాంలో తెలంగాణ ప్రజలు విసిగి పోయారని చెప్పారు. దీంతో కాంగ్రెస్ మాయ హామీలను నమ్మి ప్రజలు ఓటు వేశారని పేర్కొన్నారు. హస్తం పార్టీ ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారని ప్రశ్నించారు. ఉచిత బస్సు, సన్న బియ్యం తప్ప మరేవీ అమలు కాలేదన్నారు. "రాష్ట్రంలో గులాబీ జెండా పోయి చేయి గుర్తు వచ్చిందంతే. దోపిడీ మాత్రం ఆగలేదు. ఏ వర్గంలోనూ మార్పు రాలేదు. పది మంది భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా 2 లక్షల ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయలేదు. రాష్ట్రంలో భూములు అమ్మకపోతే పథకాలు అమలు చేయలేని పరిస్థితి. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి కుటుంబ పార్టీలే.. అవి అక్రమాలకు పెద్దపీట వేస్తున్నాయి" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

### ఈ నెల 9న 'విజయ్ దివస్'

## ఘనంగా నిర్వహించాలి : కేటీఆర్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ దీక్ష ఫలించిన డిసెంబర్ 9న రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా 'విజయ్ దివస్' వేడుకలు నిర్వహించాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలోనూ సంబరాలు చేపట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా కేసీఆర్ 2009, నవంబర్ 29న నిరాహార దీక్ష చేపట్టారు. ఈ క్రమంలోనే డిసెంబర్ 9న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ దీక్ష ఫలించిన రోజున రాష్ట్ర వ్యాప్తంగా 'విజయ్ దివస్' పేరుతో పండుగలా జరుపుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

### కోహ్లి 100 సెంచరీలు చేసే

## అవకాశముంది : సునీల్ గావస్కర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలు పూర్తి చేసుకునే అవకాశముందని దిగ్గజ బ్యాటర్ సునీల్ గావస్కం పేర్కొన్నాడు. 2027 వరల్డ్ కప్ తర్వాత కూడా కెరీర్‌ను కొనసాగించే సత్తా కోహ్లికి ఉందన్నాడు. విశాఖపట్నంలో సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో కోహ్లి (65లిబీ 45 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగాడు. అంతకుముందు జరిగిన రెండు మ్యాచ్‌ల్లో శతకాలు సాధించాడు. మొత్తం 302 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. మూడో వన్డే ముగిసిన అనంతరం స్టార్ స్పోర్ట్స్‌తో ముచ్చటించిన గావస్కర్ కోహ్లి ఫామ్ గురించి మాట్లాడాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు సచిన్ మాత్రమే 100 సెంచరీలు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కోహ్లి ఖాతాలో 84 శతకాలున్నాయి. 'ఎందుకు సాధ్యం కాదు?కోహ్లి ఇంకా కనీసం మూడు సంవత్సరాలు ఆడినా వందకు చేరేందుకు 16 సెంచరీలు అవసరం. సౌతాఫ్రికాతో సిరీస్‌లో అద్భుతంగా ఆడిన కోహ్లి మూడు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు చేశాడు. న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌లోనూ మరో రెండు శతకాలు చేస్తే అప్పుడు విరాట్ సెంచరీల సంఖ్య 86కు చేరుతుంది. 2027 వరల్డ్‌కప్ ముగిసేనాటికి భారత్ దాదాపు 35 వన్డే మ్యాచ్‌లు ఆడే అవకాశముంది. కోహ్లి వీటన్నింటిలో ఆడి ఇదే ఫామ్ కొనసాగిస్తే 100 సెంచరీలు చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం కోహ్లి తన బ్యాటింగ్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. వన్డేల్లో విరాట్ టీ20 క్రికెట్ మాదిరిగానే ఆడటం చాలా అరుదుగా చూశాం. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు నెల రోజుల విరామం దొరికింది. ఈ గ్యాప్‌లో అతని ఫామ్ ఏమవుతుందో చూడాలి. ఈ విరామం లేకపోతే కివీస్‌తో సిరీస్‌లో కచ్చితంగా రెండు లేదా మూడు సెంచరీలు సాధించేవాడు అని నేను కచ్చితంగా అనుకుంటున్నా' అని గావస్కర్ విశ్లేషించాడు. జనవరి 11 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

సోమవారం, 08 డిసెంబర్ 2025




www.viswamvoice.com



### అగ్రవర్ణ నేత కాదు కనుకే

# అంబేద్కర్‌కు అవమానమా..!

- ◆ మండల కేంద్రంలో అధికారులకు పట్టని అంబేద్కర్ వర్ధంతి
- ◆ మండల కార్యాలయాల సముదాయంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి
- ◆ విగ్రహాన్ని శుభ్రం చేసి ఆందోళన వ్యక్తం చేసిన దళిత సంఘాలు
- ◆ హుటాహుటిన మధ్యాహ్నం 12 గంటలకు నివాళులర్పించిన అధికారులు, నాయకులు



అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న దళిత నాయకులు



దళిత నాయకులు శుభ్రం చేసిన విగ్రహం వద్ద హుటాహుటిన అధికారుల నివాళులు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :**
అణగారిన వర్గాల పక్షాన అంతులేని పోరాటం చేసిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 69 వ వర్ధంతిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా శనివారం అన్ని గ్రామాల లోనూ పలువురు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్ గా అన్ని వర్గాల ప్రజలకు ఆయన హక్కులను కల్పించారని, ఆయన త్యాగాలను వెలకట్టలేమని మండలంలోని పలు గ్రామాల ప్రజా సంఘాల నాయకులు అంబేద్కర్ ను కొనియాడగా, మండల కేంద్రమైన రాయవరంలో జరిగిన ఘటన పై మాత్రం మండల వ్యాప్తంగా దళిత సంఘాలు భగ్గుమంటున్నాయి..



బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆశా జ్యోతి లా ఎందరో ఉన్నతాధికారులుగా, నాయకులు గా అధికారాలను పొందడానికి మూలమైన రాజ్యాంగ రచయిత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌కు అవమానం జరగడం ఆవేదనకరం. మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాంటి వారు బహుజనులకు పూజ్యులు అలాంటి వారికి అవమానం జరిగితే జాతి,కుల,మత తారతమ్యం లేకుండా ముక్త కంఠంతో ఏకమవుతాం. సంబంధిత వ్యక్తులపై అధికారులకు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకునే వరకూ ఉద్యమిస్తాం..

**దార్ల సుధీర్ బాబు**
**ఎస్.సి సెల్ నాయకులు, చెల్లూరు**

**రాయవరంలో రాజ్యాంగ నిర్మాతకు అవమానం**



దేశ ప్రధాని నుండి రాష్ట్రంలోని ఉన్నత స్థాయి ప్రముఖుల వరకూ భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు నివాళులు అర్పించగా, మండల కేంద్రమైన రాయవరంలో అధికారులు నిర్లక్ష్యంతో అంబేద్కర్ కు ఘోర అవమానం జరిగిందని దళిత సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళి అర్పించే క్రమంలో రాయవరంలోని మండల కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో వాటర్ ట్యాంక్ ప్రక్కన ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు శనివారం ఉదయం 11 గంటల సమయానికి చేరేసరికి తమ హృదయం ద్రవించిపోయే పరిస్థితి కనబడిందని మండల కో ఆప్షన్ సభ్యులు పోలమాటి సుధాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. పక్షుల రెట్టలతో, చెత్తాచెదారాల మధ్యలోనే అంబేద్కర్ విగ్రహం ఉందని, సకల శాఖల అధికారుల కార్యాలయాలు ఉన్న ఆ ప్రాంగణంలో, ఆయన రాసిన రాజ్యాంగం తో రిజర్వేషన్ల ద్వారా పదవులు, ఉద్యోగాలు అనుభవిస్తూ ఉన్న మండల, గ్రామ స్థాయి అధికారులకు ఆయన పట్ల కనీస గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రవర్ణ నాయకుల విగ్రహాలను, వారి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తారని, అంబేద్కర్ దళిత నాయకుడు కనుకే ఆయన వర్ధంతి వంటి ప్రత్యేక కార్యక్రమం అయినా విగ్రహం వద్ద కనీస శుభ్రత సైతం చేయించ లేదని, ఈ విషయమై అధికారులను ప్రశ్నించగా ఈరోజు ప్రత్యేకత ఏంటో తమకు తెలియదని నిర్లక్ష్యపు సమాధానం చెప్పడం మరింత ఆవేదన కలిగించిందని మండల కోఆప్షన్ సభ్యులు పోలమాటి సుధాకర్ విచారం వ్యక్తం చేస్తూ, దళితులంటే అగౌరవం తగదని హితవు పలికారు.

**ఆందోళన చేపట్టడంతో హుటా హుటిన ఏర్పాట్లు**

రాజ్యాంగ నిర్మాత, దళిత నాయకుడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కు ఘోర అవమానం కలిగేలా అధికారులు వ్యవహరిస్తున్నారని దళిత సంఘాలు ఉదయం 11 గంటల సమయంలో ఆందోళన చేపట్టడంతో, తేరుకున్న మండల గ్రామ నాయకులు, అధికారులు మధ్యాహ్నం 12 గంటల సమయంలో అప్పటికప్పుడు ఏర్పాట్లు చేసుకుని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నివాళి అర్పించారని, తాము ఆందోళన చేపట్టక పోతే అంబేద్కర్ వర్ధంతిని పట్టించుకునే వారే కాదని, ఆయనపై గౌరవం ఉంటే ముందుగా మేల్కోని, అంబేద్కర్ విగ్రహం కడిగి శుభ్రపరిచి ఉండేవారని ఆ జ్ఞాపకమే వారికి లేదని అధికారులను దళిత సంఘాల నేతలు ఎద్దేవా చేశారు. అగ్రవర్ణ నాయకులకు సంబంధించిన కార్యక్రమాలు భాధ్యత తో చేస్తారని, దళిత నాయకుడు కనుకే అంబేద్కర్ పట్ల నిర్లక్ష్య వైఖరి తో వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ విషయంలో దళిత సంఘాలన్నీ కలిసి అంబేద్కర్ కు జరిగిన అవమానంపై ఉద్యమిస్తామని హెచ్చరించారు.



రాజ్యాంగ నిర్మాతగా అత్యంత కష్టతరమైన భాద్యతలను నిర్వర్తించి, విలువైన రాజ్యాంగం దేశానికి అందించిన మహా నేతను అవమాన పరచడం అత్యంత బాధాకరం. నేను స్థానిక దళిత నాయకులతో కలిసి నివాళి అర్పించేందుకు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరేసరికి హృదయం ద్రవించిపోయింది. విగ్రహం వద్ద కనీస శుభ్రత పాటించకపోవడం, ఈ రోజు ప్రత్యేకంగా ఏంటి? అని మమ్మల్ని తిరిగి ప్రశ్నించడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం. దళిత నేత గానే కాక, అన్ని వర్గాల ప్రజలకు అంబేద్కర్ హక్కులను అందించారు. దేశానికి సైతం ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివి. అలాంటి నాయకుని అధికారులు అవమానించడం ఆవేదన కలిగించింది.

**పొలమాటి సుధాకర్**
**మండల కో ఆప్షన్ సభ్యులు, రాయవరం**

‘అఖండ 2’ పై

## ఫైనల్ క్లారిటీ.. ఆరోజు?



**విశ్వం వాయిస్ న్యూస్ :** నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా సంయుక్త మీనన్ హీరోయిన్ గా మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో చేస్తున్న అవైటెడ్ చిత్రమే అఖండ 2 తాండవం. మంచి హైప్ ఉన్న ఈ సినిమా వాయిదా పడి ఇప్పుడు నెక్స్ట్ రిలీజ్ డేట్ కోసం సిద్ధంగా ఉంది. అభిమానులు వీలైనంత త్వరగా సినిమా విడుదల చేయాలని భావిస్తుంటే మేకర్స్ మంచి సమయం కోసం చూస్తున్నారు. అసలు ఈ అంతటిలో ఒక తుది క్లారిటీ మెయిన్ గా బయటకి రావాల్సి ఉంది. మరి ఈ క్లారిటీ రేపు సోమవారం లేదా మంగళవారంకి వచ్చేస్తుంది అని ఇప్పుడు సమాచారం. మేకర్స్ అయితే ఈ డిసెంబర్ 12 లేదా 25 డేట్స్ లోనే చూస్తున్నారట. సో వాటిలో ఏదొక డేట్ ఈ రెండు రోజుల్లో కన్ఫర్మ్ కానుందట. సో అభిమానులు ఈ రెండు రోజులు వెయిట్ చేస్తే సరిపోతుంది. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించగా 14 రీల్స్ ప్లస్ వారు నిర్మాణం వహించారు. అలాగే ఈ సినిమా 3డి లో కూడా విడుదల కాబోతుంది.

### వాకర్స్ యోగా అండ్ లాంఫింగ్ క్లబ్‌చే

## దేవాలయ డైరెక్టర్లకు సన్మానం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశాలలోని ఆనందా గార్డెన్స్ లో వృద్ధులకు వృద్యాప్య పింఛన్లు పంపిణీ,నగరంలోని దేవస్థానాలకు నూతనంగా డైరెక్టర్లుగా నియమితులైనవారికి సన్మాన కార్యక్రమం క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన మాజీ కార్పొరేటర్ వాసంశెట్టి గంగాధరరావు మరియు కుటుంబ సభ్యులను, క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగా భవాని, దాత అయిన తోట కిరణ్ లను వేదిక మీదకు ఆహ్వానించి వారిని సభకు పరిచయం చేశారు.ముఖ్య అతిథులు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి నిర్విరామంగా వృద్ధులకు పించన్లు అందించడం ఎంతో గొప్ప విషయంగా అభివర్ణిస్తూ ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో జరగడానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని సభకు తెలియచేశారు.ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఒక్కో వృద్ధునకు రూ.500 చొప్పున 85 మందికి రూ.42,500 అందచేశారు.అదేవిధంగా వాసంశెట్టి గంగాధరరావు భార్య కీ.శే.వాసంశెట్టి వరలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్న వితరణ చేశారు. అదేవిధంగా పెన్షనర్ జి.నారాయణమూర్తి వృద్ధులకు అల్పాహారం ఆందించారు. మార్కండేయస్వామి దేవస్థానం డైరెక్టర్ గా నియమితులైన శనపతి సత్తిబాబు, కోటిలింగేశ్వరస్వామి దేవస్థానం డైరెక్టర్లుగా నిరమితులైన తోట కిరణ్, గుబ్బల గంగాభవానిలకు క్లబ్ సభ్యులు శాలువ కప్పి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో భేరి రత్నాంబ,మొగల్తూరు దుర్గ, లంకే శ్రీదేవి మావూరి రామకృష్ణ, సూరపురెడ్డి తాతారావు,ఉప్పులూరి కాశీ విశ్వనాథం,అనసూరి శ్రీనివాస్,రొక్కం అప్పారావు,రొక్కం గోపి,బొల్ల పెద సత్తి బాబు,గీసాల బాపూజీ,సప్పా ఆదినారాయణ, బిల్డర్ చిన్న తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అంతా క్లబ్ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు ఆధ్వర్యంలో జరిగింది.

## ప్రజలకు మేలు చేకూరే కార్యక్రమాలే చేయాలి

### సీతంపేటలో పేదలకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు మేలు చేకూర్చే కార్యక్రమాలు చేయడం వల్ల వారికి మనం ఎంతోకొంత సహకారం అందించ వారమవు తామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) సూచించారు. అక్టోబర్ 26వ తేదీన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పుట్టిన రోజును పురస్కరించుకుని 40వ డివిజన్ తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇంచార్జ్ కొల్లి నాని ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆ సమయంలో కంటి పరీక్షలు చేయించుకోగా 136 మందికి కళ్ల జోళ్లు అవసరం అని వైద్యులు గుర్తించారు. ఈ రోజు సీతంపేట ఎన్టీఆర్ విగ్రహం వద్ద కొల్లి నాని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరై ఆ 136 మందికి ఉచితంగా కళ్లజోళ్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఎలాంటి ఆర్భాటాలకు వెళ్లకుండా పేదలకు ఉపయోగపడేలా వైద్య శిబిరం నిర్వహించిన కొల్లి నానిని అతని మిత్ర బృందాన్ని అభినందించారు. తన ఆలోచనలకు అనుగుణంగా నగరంలోని యువత అంతా పని చేస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కాగా సీతంపేట ప్రాంత ప్రజలంతా ఎప్పుడూ తమకు అభిమానంగానే ఉంటారని అన్నారు. ఈ ప్రాంతంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు చాలా ఉన్నాయని, ఒక్కోక్కటికీ వాటిని పరిష్కరిస్తామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అది తనకు వచ్చిన సమస్యగానే భావించి ఆ సమస్య తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల్లో ఒక్కడిగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో 38వ డివిజన్ ఇన్‌ఛార్జ్ బుడ్డిగ రవి, నాయకులు తవ్వా రాజా, కరగాని వేణు, మళ్ల వెంకటరాజు, చాపల చిన్నరాజు, సమ్మంగి దుర్గా ప్రసాద్, సింహా హరి, సింహా రమణ, శెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

### ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ శశాంక



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సివిల్స్ కోచింగ్ కోసం అభ్యర్థుల ఎంపికకు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం ఏడు కేంద్రాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్ కృష్ణ నాయక్ తెలియ చేశారు. అందులో భాగంగా రాజమహేంద్రవరం బీసీ స్టడీ సర్కిల్‌లో స్క్రీనింగ్ పరీక్ష విజయవంతంగా నిర్వహించినట్లు బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ బి శశాంక తెలియ చేశారు. ఆదివారం ఉదయం ఆర్‌డీవో ఆర్.కృష్ణ నాయక్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ప్రశ్నాపత్రాల సీల్ విప్పి స్క్రీనింగ్ పరీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్స్ పరీక్షలకు సిద్ధం కావాలనుకునే అభ్యర్థులకు ప్రతిభ ఆధారంగా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపిక రిజర్వేషన్ నిష్పత్తి మేరకు బీసీ 66%, ఎస్సీ 20%, ఎస్టీ 14% వాటాగా ఉంటుందని వివరించారు. ఎంపికైన వారికి నందమూరి తారక రామారావు జిల్లా, విజయవాడ గొల్లపూడి బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ కల్పిస్తామని చెప్పారు. మొత్తం 143 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, అందులో 126 మంది హాజరు కాగా, 17 మంది గైర్హాజరు అయినట్లు వెల్లడించారు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు / జిల్లా బీసీ సంక్షేమ అధికారి కుమారి బి.శశాంక మాట్లాడుతూ ఉత్తమ బోధన, వసతి, భోజనం, అధ్యాయన సామగ్రితో కలిపి పూర్తి స్థాయిలో సివిల్ సర్వీస్ పోటీ పరీక్షలకు సిద్ధం చెయ్యడం కోసం రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ కేంద్రం గా ఉచిత కోచింగ్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.టి.డబ్ల్యూ.వో కె.ఎన్.జ్యోతి, ఏ.బీసీడబ్ల్యూ.వోలు ముత్యాల సుబ్బారావు, టి.వి.ప్రసాద్, పి.రామకృష్ణ, కె.ఎన్.దొర, టి.వెంకటేశ్వర్లు, ఏ.ఎస్.డబ్ల్యూ.వో పి.వి.ఎన్.సత్యనారాయణ, హెచ్.డబ్ల్యూ.వోలు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సేవా ట్రస్టుచే ఉపకార వేతనాలు

### 100 మందికి 5 లక్షల రూపాయలు అందజేత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా బ్రాహ్మణ సేవా ట్రస్టు ద్వారా చదువులో రాణిస్తూ ఆర్థికంగా వెనుకబడి ఉన్న విద్యార్థిని, విద్యార్థులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని ట్రస్టు కార్యవర్గ సభ్యులు వెల్లడించారు. స్థానిక మల్లిగ సత్రంలో 2024-25 సంవత్సరానికి గాను 100 మంది విద్యార్థిని, విద్యార్థులకు 5 లక్షల రూపాయలను ఆదివారం స్కాలర్ షిప్పుల రూపంలో అందచేసారు. ట్రస్టు కార్యవర్గం దంతుర్తి ప్రసాద్, గాడేపల్లి సత్యనారాయణ మూర్తి, చీమలకొండ వీరప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి తదితరుల చేతులమీదుగా ఈ ఉపకార వేతనాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో దంతుర్తి ప్రసాద్ మాట్లాడుతూ తన అన్న కుమారుడు దంతుర్తి వీరభద్రం అమెరికాలో ఉద్యోగం చేస్తూ తన మిత్ర బృందం సహకారంతో ప్రతీ ఏటా ఈ విధంగా స్కాలర్ షిప్పులు ఇచ్చేందుకు నిధులు సమకూర్చుతున్నట్టు తెలిపారు. ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం పొందిన విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడిన తరువాత ట్రస్టుకి సహాయం అందిస్తే దాని ద్వారా మరింత మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదే స్ఫూర్తితో సామర్లకోటకు చెందిన విద్యార్థి ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇన్ఫోసిస్ లో ఉద్యోగం సంపాదించుకుని ఈ ఏడాది ఇద్దరు విద్యార్థులకు వారి చేతులమీదుగానే ఆర్థిక సాయం అందచేయడం అభినందనీయమన్నారు. బ్రాహ్మణత్వం, హిందుత్వం, సనాతన ధర్మాన్ని కాపాడుతూ బ్రాహ్మణులు ముందుకు సాగాలని, వివాహం, మత మార్పిడుల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. బ్రాహ్మణ వ్యవస్థను ముందుకు నడిపించేందుకు అందరూ తగిన విధంగా కట్టుబాట్లు విధించుకోవాలని కోరారు. ముఖ్య అతిథిగా హాజరైన తేజోమూర్తుల మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా బ్రాహ్మణ కుటుంబాలకు విద్య, ఉపాధి, ఇళ్ల మరమ్మతులకు తక్కువ వడ్డీకే రుణాలు పొందే అవకాశం ఉందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 600 రూపాయలు కట్టి క్రెడిట్ సొసైటీలో శాశ్వత సభ్యత్వం చెల్లించి ఈ సదుపాయాలన్ని పొందవచ్చన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన తేజోమూర్తుల నరసింహ మూర్తి, సామర్లకోట శ్రీ చాణుక్య కుమార భీమేశ్వర స్వామి ఆలయానికి డైరెక్టర్‌గా నియమితులైన చీమలకొండ వీర ప్రసాద్ లకు చిరు సత్కారం చేసారు. కార్యక్రమంలో రేగడమిల్లి రామ్ దేవ్ శర్మ, జ్యోషభట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.



# మెగా విశాఖ దిశగా జీవీఎంసీ?

## మున్సిపల్ ఎన్నికలు డౌటేనా?

రాష్ట్రంలోనే అతిపెద్ద నగరం విశాఖ పరిధిని మరింత విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని అంటున్నారు. పెందుర్తి, భీమిలి ఎమ్మెల్యేలు రాసిన లేఖలతో ప్రస్తుతం ఉన్న గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో మరో 84 గ్రామాలను విలీనం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇద్దరు ఎమ్మెల్యేలు వేర్వేరుగా రాసిన లేఖలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ఎమ్మెల్యేల సూచనలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ సెక్రటరీ ఆదేశించారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కు సమీపంలో ఉన్న పెందుర్తి, భీమిలి నియోజకవర్గాల్లోని ఆయా మండలాల గ్రామాలతోపాటు పద్మనాభం, ఆనందపురం మండలాల్లోని గ్రామాలను జీవీఎంసీ పరిధిలోకి తేవాలని ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, గంటా శ్రీనివాసరావు ప్రభుత్వానికి లేఖ రాశారని సమాచారం. నిజానికి ఈ నాలుగు మండలాల్లోని గ్రామాలను గతంలోనే జీవీఎంసీలో కలపాలని ప్రతిపాదనలు వచ్చాయి. అయితే అప్పట్లో సుమారు 84 గ్రామాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ 84 గ్రామాలను జీవీఎంసీలో కలపాలనే ప్రతిపాదనను గత ప్రభుత్వం విరమించుకుంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో విలీన ప్రక్రియ మరోసారి తెరపైకి వచ్చింది. ప్రధానంగా ఏపీ ఐటీ క్యాపిటల్ గా విశాఖను తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే విశాఖను ఏఐ డేటా సెంటర్ల హబ్ గా ప్రకటించింది. లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయి. కొత్త ఐటీ పరిశ్రమలు ప్రారంభానికి రంగం సిద్ధమవుతోంది. ఈ నెలలోనే కాగ్నిజెంట్, టీసీఎస్ తమ సర్వీసు సెంటర్లను ప్రారంభిస్తున్నాయి. దీంతో జీవీఎంసీని మరింత విస్తరించాలనే ప్రతిపాదన ఆసక్తి రేపుతోంది. ఆయా గ్రామాల ప్రజలు కూడా జీవీఎంసీలో విలీనానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం జీవీఎంసీ 682 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. సుమారు 21 లక్షల మంది జనాభా ఉన్నారు. 98 డివిజన్లతో విస్తరించిన జీవీఎంసీని మెగా సిటీగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు సూచించిన 84 గ్రామాలను గ్రేటర్ విశాఖలో కలిపితే మరో 4 లక్షల జనాభా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ను గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ గా విస్తరించాలని 20 ఏళ్ల కిందట ప్రభుత్వం భావించింది. గాజువాక మున్సిపాలిటీతోపాటు పెందుర్తి మండలంలో కొన్ని గ్రామాలను అప్పట్లో కార్పొరేషన్ లో విలీనం చేసింది. అదేవిధంగా విశాఖ నగర శివార్లలో ఉన్న మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది పరిసర ప్రాంతాలను విశాఖలో కలుపుతూ జీవీఎంసీ ఏర్పాటు చేశారు. ఇక 2011లో విశాఖను మరింత విస్తరించాలనే ఉద్దేశంతో భీమిలి, అనకాపల్లి మున్సిపాలిటీలను ఆ పక్కనున్న గ్రామాలను విలీనం చేశారు. అయితే భీమిలి, అనకాపల్లి మున్సిపాలిటీలు జీవీఎంసీలో కలిసినా, వాటికి సమీపంలో ఉన్న గ్రామ పంచాయతీలు మాత్రం అభ్యంతరం చెప్పాయి. దీంతో వాటిని వదిలేసి భీమిలి, అనకాపల్లిని కలుపుతూ జీవీఎంసీని 98 డివిజన్లుగా పునర్వ్యవస్థీకరించారు. ఇక 2020లో జీవీఎంసీకి ఎన్నికలు జరిగాయి. వచ్చే ఏడాది మార్చి 17తో జీవీఎంసీ పాలకవర్గం పదవీకాలం ముగియనుంది. తాజాగా మెగా విశాఖ ప్రతిపాదన తెరపైకి రావడం, ప్రభుత్వం కూడా ఆ ప్రతిపాదనకు సానుకూలంగా ఉండటంతో కార్పొరేషన్ ఎన్నికలపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం విలీన ప్రక్రియ చేపడితే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండదని అంటున్నారు. దీంతో జీవీఎంసీ ఎన్నికలు వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్, గంటా శ్రీనివాసరావుల ప్రతిపాదనల ప్రకారం ఆయా గ్రామాలు గ్రేటర్ విశాఖలో విలీనమైతే విశాఖ జిల్లా మొత్తం కార్పొరేషన్ పరిధిలోకి వస్తుందని అంటున్నారు.

# విజయసాయిరెడ్డిలో సడన్ ఛేంజ్..

## హిందు మతం కోసం ఇంట్రెస్టింగ్ ట్వీట్



దేశంలో అత్యధికుల మత విశ్వాసాలను కాపాడాల్సిన అవసరం ఉందని వైసీపీ మాజీ నేత, మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. మతమార్పిడులపై ఓ యూట్యూబర్ చేసిన వీడియోను తన ఎక్స్ లో షేర్ చేసిన విజయసాయిరెడ్డి.. ఆ యూట్యూబర్ వాదనతో ఏకీభవిస్తున్నట్లు కామెంట్ చేశారు. గత రెండు దశాబ్దాలుగా దేశంలో జరిగిన మతమార్పిడులపై ప్రభుత్వం విచారణ జరపాలని ఆయన కోరుతున్నారు. హిందూ మతాలపై కుట్రలు జరుగుతున్నాయని, అటువంటి కుట్రలను సహించేది లేదని కూడా విజయసాయి తన ట్వీట్ లో స్పష్టం చేశారు. మత మార్పిడులకు ప్రయత్నిస్తే అటువంటి వారికి తగిన బుద్ధి చెప్పి గుణపాఠం నేర్పాలని విజయసాయి పిలుపునిచ్చారు. హిందూ మతానికి చెందిన వారిని డబ్బు ఆశ చూపి మరో మతంలోకి మారాలని ఒత్తిడి చేస్తున్నారనే ఉద్దేశంతో విజయసాయిరెడ్డి చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. "హిందూ మతం పై కుట్రలు సహించేది లేదు, డబ్బు ఆశ చూపి మతం మార్చాలని ప్రయత్నిస్తే అటువంటి వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పి గుణపాఠం నేర్పిద్దాం. గత రెండు దశాబ్దాలుగా జరిగిన మతమార్పిడులపై కమిటీ వేసి ప్రభుత్వం విచారణ జరపాలి. దేశం కోసం ధర్మం కోసం హిందువులు లో ఉన్న అన్ని సామాజిక వర్గాలు ఒక్కటవ్వాలి .. అదే భారతదేశానికి రక్ష... శ్రీరామ రక్ష" అంటూ విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు. తన ట్వీట్ కు మతమార్పిడులను ఖండిస్తూ ఓ యూట్యూబర్ చేసిన వీడియో లింక్ ను జత చేశారు. ఇక విజయసాయిరెడ్డి ట్వీట్ సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీసింది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో విజయసాయిరెడ్డి తన అధికారిక 'ఎక్స్'లో ట్వీట్ చేయగా, కొద్ది సమయంలోనే వైరల్ అయింది. ఆయన ట్వీట్ పై చాలా మంది ప్రతిస్పందిస్తున్నారు. ఆయన పనిచేసిన వైసీపీ పార్టీ హయాంలోనే ఎక్కువ మత మార్పిడులు జరిగాయని కొందరు కామెంట్స్ చేస్తుండగా, రెండు దశాబ్దాలు అంటే 'ముందు మన మహామేత కుటుంబసభ్యుల దగ్గర నుండి మొదలు పెడదామా కాపు రెడ్డి గారూ' అంటూ ఒకరు కామెంట్ చేశారు. 'మాకు డబ్బులు ఇచ్చారు అందుకే మేము మతం మారాము అనే వాళ్ళని ఒక్కళ్ళని చూపించు.' అంటూ మరికొందరు విజయసాయిరెడ్డి పోస్టును ఖండిస్తున్నారు. మొత్తానికి విజయసాయిరెడ్డి ట్వీట్ పై ఎక్స్ లో పెద్ద చర్చే జరుగుతోంది. మరోవైపు దాదాపు 20 ఏళ్లుగా రాష్ట్రంలో రాజకీయం చేసిన విజయసాయిరెడ్డి ఎన్నడూ లేనట్లు మతాలను ప్రస్తావిస్తూ పోస్టు చేయడంపై పొలిటికల్ సర్కిల్స్ లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీకి రాజీనామా చేసి రాజకీయ సన్యాసం తీసుకుంటానని గతంలో ప్రకటించిన విజయసాయిరెడ్డి.. మళ్లీ రాజకీయాలపై ఆసక్తి పెంచుకుంటున్నారా? అని అనుమానిస్తున్నారు. ప్రధానంగా తనపై ఉన్న కేసుల నుంచి రక్షణకు ఆయన బీజేపీకి దగ్గరయ్యే పనిలో ఉన్నారని, అందుకే హిందుత్వకు మద్దతుగా మాటలు మొదలు పెట్టారని మరికొందరు అంటున్నారు. మొత్తానికి విజయసాయిరెడ్డి ట్వీట్ సెలవు రోజైన ఆదివారం రాజకీయ సెగలు పుట్టించిందనే చెబుతున్నారు.

# టీడీపీ వర్సెస్ వైసీపీ

## ...అక్కడ ముందే హీట్



ఇక శింగనమలలో పోటాపోటీగా రాజకీయం సాగుతోంది. అక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యే బండారు శ్రావణి కూడా దూకుడుగానే ఉంటారు. ఏపీ కాంగ్రెస్ నుంచి రెండు సార్లు గెలిచి ఒకసారి మంత్రి కూడా అయిన సాకే శైలజానాథ్ పీసీసీ చీఫ్ గా కూడా పనిచేశారు. ఆయన 2024 ఎన్నికల తరువాత వైసీపీలో చేరిపోయారు. దాంతో ఆయన సొంత సీటు శింగనమలను జగన్ ఇంచార్జిగా చేశారు. దాంతో అక్కడ రాజకీయ వేడిని ముందే పుట్టిస్తున్నారు ఈ సీనియర్ నేత. ఎన్నికలు చూస్తే ఇంకా మూడేళ్ళకు పై దాటి ఉన్నాయి. అయినా సరే తనదైన స్టైల్ లో పొలిటికల్ బ్యాటింగ్ ని స్టార్ట్ చేశారు. అక్కడ తొలిసారి గెలిచిన టీడీపీ ఎమ్మెల్యే బండారు శ్రావణితో ఢీ కొడుతూ పార్టీ పట్టుని పెంచే పనిలో పడ్డారు.

**వైసీపీకి బలం :**

రాయలసీమలో వైసీపీకి బలం ఉంది. అయితే అనంతపురం జిల్లాలో టీడీపీ చాలా సీట్లలో గట్టిగానే ఉంది. అందులో శింగనమలలో కూడా టీడీపీ జెండా బాగానే ఎగుతోంది. 2024 ఎన్నికల్లో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని కాదని ట్రక్ డ్రైవర్ గా ఉన్న వీరాంజనేయులుకి టికెట్ ఇచ్చింది. ఆయన మంచి అభ్యర్థి అయినా అంగబలం అర్థ బలం సరిపోలేదు. ఇక ఎన్నికల్లో ఓటమి తరువాత కూడా ప్రతిపక్షంలో పార్టీని నడిపించలేకపోయారని చెప్పుకున్నారు. అదే సమయంలో శైలజానాథ్ కాంగ్రెస్ నుంచి వైసీపీలోకి రావడంతో ఆయనకు ఈ సీటు ఇచ్చారు. ఇక ఎన్నికలు ఎంతో దూరంలో ఉన్నా ఈ సీనియర్ నాయకుడు జోరు పెంచుతున్నారు.

**పోటా పోటీగా :** ఇక శింగనమలలో పోటాపోటీగా రాజకీయం సాగుతోంది. అక్కడ అధికార పార్టీ ఎమ్మెల్యే బండారు శ్రావణి కూడా దూకుడుగానే ఉంటారు. పైగా సిట్టింగ్ ఎమ్మెల్యే కావడం యువ నాయకురాలు కావడంతో తన పాబల్యం పెంచుకునేందుకు చూస్తున్నారు. ఆమె ఒక వైపు ప్రభుత్వ కార్యక్రమాలను జనంలో ఉంచుతూ ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ అసలైన ప్రతిపక్ష పాత్రని శైలజానాథ్ పోషిస్తున్నారు. ఆయన తాజాగా అరటి గెలలను మెడలో వేసుకుని భారీ ర్యాలీని రైతులతో నిర్వహించి అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. అరటి రైతులకు గిట్టుబాటు ధర లేదని చెబుతూ ఆయన కూటమి ప్రభుత్వం మీద భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.

**జనరల్ కేటగిరిలోకి :** అంతే కాదు ఏ ఇష్యూ అయినా జనంలో అంటున్నారు. దాంతో ఇక్కడ రాజకీయం చూస్తే హీటెక్కిపోతోంది. వచ్చే ఎన్నికల్లో శైలజానాథ్ కి టికెట్ వైసీపీ నుంచి ఖాయమని అంటున్నారు. మరి టీడీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేకి ఇస్తారా లేదా అన్నది చూడాలి. అయితే ప్రస్తుతానికి శింగనమల రిజర్వుడు నియోజకవర్గం గా ఉంది. రేపటి రోజున పునర్ విభజన జరిగితే జనరల్ కేటగిరి లోకి వెళ్తుంది అని అంటున్నారు. దాంతో 2029 ఎన్నికల్లో ఎవరు పోటీ చేస్తారో కూడా తెలియదు. కానీ వైసీపీ టీడీపీల తీరు చూస్తే మాత్రం రేపో మాపో ఎన్నికలు అన్నట్లుగానే సీన్ ఉందని అంటున్నారు.

# వచ్చే ఎన్నికల్లోనూ 'కూటమి' అదే వ్యూహం..!

తాజాగా సీఎం చంద్రబాబు పార్టీ నాయకులతో భేటీ అయిన నేపథ్యంలో వైసీపీ వ్యవ హారాలు కూడా చర్చకు వచ్చాయి. తరచుగా జగన్.. తామే అధికారంలోకి వచ్చేస్తామని చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కూటమి బలమైన వ్యూహంతోనే ముందుకు సాగాలని నిర్ణయించుకుందా? గత ఎన్ని కల్లో ఎలా అయితే.. ప్రచార అస్త్రాన్ని ప్రయోగించారో.. వచ్చే ఎన్నికల్లోనూ అదే విధంగా ప్రచారం చేయా లని భావిస్తున్నారు. తాజాగా సీఎం చంద్రబాబు పార్టీ నాయకులతో భేటీ అయిన నేపథ్యంలో వైసీపీ వ్యవ హారాలు కూడా చర్చకు వచ్చాయి. తరచుగా జగన్.. తామే అధికారంలోకి వచ్చేస్తామని చెబుతున్నారు. ఇదే విషయాన్ని టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబు వద్ద ప్రస్తావించారు. వైసీపీ ఏదో వ్యూహంతో ఉంద ని.. వచ్చే ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామని పదే పదే చెబుతున్నారని వ్యాఖ్యానించారు. దీనిపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మనం మరింత పక్కా వ్యూహంతో వెళు తున్నాం. గత ఎన్నికల్లో ఎలా అయితే.. ప్రచారం జరిగిందో ఈ సారి అంతకుమించిన ప్రచార వ్యూహాన్ని సిద్ధం చేస్తాం. మీరేమీ బెంగ పడాల్సిన అవసరం లేదు అని వ్యాఖ్యానించినట్టు తెలిసింది.

అదేసమయంలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని.. దీని గురించి ఆలోచించాల్సిన అవస రం లేదని.. ముందు ప్రజల మధ్యకు వెళ్తే ఫలితం సానుకూలంగానే ఉంటుందని కూడా చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లోనే కాదు.. తదుపరి ఎన్నికల్లోనూ మనదే విజయం అనిఆయన తేల్చి చెప్పారు. దీనిపై ఎవరూ ఎక్కువగా ఆలోచించవద్దని.. ముందుగా ప్రజలను కలుసుకుని.. ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలని కూడా చెప్పారు.

# రాజమండ్రి భరత్‌కి జగన్ ఇచ్చే సందేశం..?



ఈసారి ఎంపీ ఎమ్మెల్యే సీట్ల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని జగన్ ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. రాజమండ్రి నుంచి యువ నాయకుడిగా భరత్ ఉన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనను ఏరి కోరి రాజమండ్రి ఎంపీ సీటు నుంచి జగన్ 2019 ఎన్నికల్లో పోటీ చేయించారు. ఈ సామాజిక సమీకరణ బ్రహ్మాండంగా పనిచేసింది. ఆ ఎంపీ సీటుతో పాటు ఆ పరిధిలో మెజారిటీ సీట్లు వైసీపీ గెలుచుకుని విజయ ఢంకా మోగించింది. అప్పట్లో వైసీపీ వేవ్ కూడా బాగా పనిచేసింది. అయితే 2024 ఎన్నికల్లో అన్నీ తారు మారే అయ్యాయి. సీట్ల షిఫ్టింగ్ బదిలీలు ఇలా అనేక పరిణామాలు జరిగిపోయాయి. దానికి తోడు అయిదేళ్ళ పాలన మీద యాంటీ ఇంకెంబెన్సీ సైతం తట్టుకోలేని పరిస్థితిని తెచ్చింది. అలా కోలుకోలేని దెబ్బ అయితే ఎన్నికల్లో వైసీపీ చవి చూసింది అని విశ్లేషణలు ఉన్నాయి.

**జగన్ మదిలో అదే :**

ఈసారి ఎంపీ ఎమ్మెల్యే సీట్ల విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని జగన్ ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. అంతే కాదు ఎక్కడా మొహమాటాలకు పోవడాలు అసలు లేవని అంటున్నారు పని మంతులకే సీట్లు అని ఇప్పటి నుంచే చెబుతున్నారు. అంతే కాదు సామాజిక సమీకరణలు, పార్టీ పట్ల వారికి ఉన్న కమిట్ మెంట్, అలాగే జనంలో ఉన్న గ్రాఫ్ ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని టికెట్ ఇవ్వాలని చూస్తున్నారు అని చెబుతున్నారు. దాంతో పాటుగా బలమైన ఎంపీ అభ్యర్థులను వచ్చే ఎన్నికల్లో పోటీకి దించాలని జగన్ భారీ స్కెచ్ గీస్తున్నారు అని అంటున్నారు.

**ఆ ప్రభావంతోనే :** ఎపుడైనా ఎంపీ సీట్లో బలమైన క్యాండిడేట్ ఉంటే ఆ ప్రభావం కచ్చితంగా అసెంబ్లీ ఎన్నికల మీద పడుతుంది అని అంటున్నారు. అందుకే మొత్తం పాతిక ఎంపీ సీట్లకు గానూ సమర్థవంతమైన నేతలను ఇప్పటి నుంచే వేటాడే పనిలో ఉన్నారని అంటున్నారు. అందులో కొందరికి అయితే ముందే చెప్పేసి మీ పనిలో మీరు ఉండాలని సూచిస్తున్నారు అని అంటున్నారు. ఆ విధంగా రాజమండ్రికి చెందిన మాజీ ఎంపీ భరత్ విషయంలో జగన్ స్పష్టమైన సందేశం ఇస్తారని అంటున్నారు. ఈసారి పోటీ చేసేది ఎంపీ సీటుకే సుమా అని ఆయనకు ముందే చెప్పాలని అనుకుంటున్నారుట.

**గతసారి అలా :** ఇక వెనక్కి వెళ్తే 2024 ఎన్నికల్లో రాజమండ్రి అర్బన్ నుంచి మార్గాని భరత్ ని పోటీ చేయించారు. ఆయన కూడా ఎమ్మెల్యే అయి మంత్రి కావాలని భావించారు. కానీ మొత్తం సీన్ రివర్స్ అయింది అని ఫ్లాష్ బ్యాక్ చెబుతోంది. దాంతో ఈసారి భరత్ సైతం పార్లమెంట్ మెట్లు ఎక్కాలనే చూస్తున్నారు అన్న మాట ఉంది. అయితే ఆయన అనుచరులు మాత్రం ఎమ్మెల్యేగానే పోటీ చేయాలని సూచిస్తున్నారుట. కానీ జగన్ మాత్రం భరత్ విషయంలో ఎంపీ అయితేనే బాగుంటుంది అని సీరియస్ గానే ఆలోచిస్తున్నారని అంటున్నారు. దాంతో భరత్ కి ఆ దిశగానే వెళ్ళమని చెబుతారని అంటున్నారు. ఇదే తీరున గోదావరి జిల్లాలలో మరికొంతమందికి ఎంపీకి పోటీ చేయించాలని చూస్తున్నారు అని అంటున్నారు. చూడాలి మరి ఈసారి వైసీపీ ఆలోచనలు వ్యూహాలు ఎలా పనిచేయబోతున్నాయో.

# మొక్కకు అరుదైన అద్భుతం 100 బ్రహ్మకమలం వికాసం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేటకు చెందిన పురోహితులు పెద్దింటి రామం ఇంటి పెరట్లో విశేషమైన ఆధ్యాత్మిక సంఘటన చోటుచేసుకుంది. ఒకే బ్రహ్మకమలం మొక్కకు ఒకేసారి 100 పువ్వులు వికసించడం అక్కడి ప్రాంత ప్రజల్లో ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించింది. పెద్దింటి రామం ఈ మొక్కను 4 సంవత్సరాల క్రితం పూణే నుండి ప్రత్యేకంగా తెప్పించుకున్నారని తెలిపారు. గత నాలుగేళ్లలో ఈ ఒక్క మొక్కకు ఇప్పటివరకు 5000కి పైగా పువ్వులు వికసించాయని ఆయన చెప్పారు. సాధారణంగా బ్రహ్మకమలం మొక్క చాలా అరుదుగా పూస్తుందిబీ సంవత్సరంలో కొన్ని రోజులు మాత్రమే పువ్వు విరుస్తుంది. అలాంటి మొక్కపై ఈ స్థాయిలో పుష్పాలు రావడం అత్యంత ప్రత్యేకం. బ్రహ్మకమలం ఆధ్యాత్మికత, శుభఫలితాలకు ప్రతీక బ్రహ్మకమలం హిమాలయాలలో కనిపించే అత్యంత పవిత్రమైన, అరుదైన పుష్పం. దీనిని "పార్వతీ పుష్పం,రాత్రిరాణి, హిమాలయ బ్రహ్మ కువ్వ" అని కూడా పిలుస్తారు. హిందూ ధర్మంలో ఈ పుష్పానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.



**బ్రహ్మకమలం ప్రత్యేకతలు**

రాత్రి సమయంలో మాత్రమే వికసించే పవిత్ర పుష్పం. ఈపువ్వులు పూర్తిగా వికసించే సమయం కేవలం 2,3 గంటలు పూసే ప్రతి సమయంలో ఆధ్యాత్మిక శక్తులు,శుభఫలితాలు వస్తాయని నమ్మకం ఇంట్లో బ్రహ్మకమలం పూయడం శ్రీ మహాలక్ష్మి కటాక్షం లభించినట్లు భావిస్తారు అరుదైన ప్రకృతి వరప్రసాదంగా పరిగణిస్తారు. "ఈ బ్రహ్మకమలం మొక్కను నేను ఎంతో ప్రేమ, శ్రద్ధలతో పెంచుతున్నాను. మొక్క ఆరోగ్యంగా పెరగటానికి ప్రతిరోజూ నీళ్లు, సరైన సంరక్షణ చేస్తాను. ఈసారి ఒకేసారి వంద పువ్వులు పూయడం దేవుని ఆశీర్వాదం అనిపిస్తోంది. మా ఇంటికే కాకుండా మా గ్రామానికి కూడా ఇది శుభసూచనం" అని పెద్దింటి రామం తెలిపారు.

### అనారోగ్య బాధితునికి

# మంత్రి సుభాష్ రూ.15 వేలు సాయం

**నరసాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పక్షవాతంతో బాధపడుతున్న ఒక వ్యక్తికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం పొదలాడ గ్రామానికి చెందిన కుక్కల వెంకటేశ్వరరావు పక్షవాతంతో బాధపడుతున్నారు. వెంకటేశ్వరరావు ఆర్థిక, అనారోగ్య స్థితిని స్థానికులు మంత్రి సుభాష్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణం స్పందించిన మంత్రి సుభాష్ తక్షణసాయంగా రూ. 15 వేలు చెక్కు ను అందించి మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. మానవత్వంతో కష్టం తెలుసుకొని సహాయం అందించిన మంత్రి సుభాష్ సేవా గుణానికి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు, శెట్టిబలిజ సంఘీయులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# టిడ్కో అపార్ట్మెంట్లలో కోటి సంతకాల సేకరణ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పురపాలక సంఘం టిడ్కో అపార్ట్మెంట్లు వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గవర్నమెంట్ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపుమేరకు చేస్తున్న కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా టిట్కో అపార్ట్మెంట్లు వద్ద ప్రజల మద్దతు కోరుతూ ప్రతి గడపగడపకు వెళ్ళి ప్రైవేటీకరణ నష్టాలు వివరించారు. పిల్లల భవిష్యత్తు, నిరుపేద కుటుంబీకుల ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన వైద్యం విషయంలో తీవ్రమైనటువంటి అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పుడే ప్రజలు మేల్కొని కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ఖండించాలని దుర్గారాణి పేర్కొన్నారు.ప్రజల మద్దతును కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్, జిల్లా పార్టీ జనరల్ సెక్రెటరీ యర్రగుంట అయ్యప్ప, షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా,నియోజకవర్గం ఐ.టి విభాగం కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, యువజన విభాగం జిల్లా సెక్రెటరీ కోణాల చంద్ర బోస్, కొమ్మోజు నాగేశ్వరరావు, గునుపే భూషణం, తుమ్మ శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అమ్ముడా చైర్మన్






**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత దోసూరి అన్నపూర్ణ ప్రథమ వర్ధంతి పురస్కరించుకొని ఆమె పేరిట చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు ఈ సందర్భంగా ట్రస్ట్ ఏర్పాటు చేసే సేవా కార్యక్రమాలు చేస్తున్న కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, నల్లా చిట్టిబాబు, ఆర్‌డిఎస్ ప్రసాద్, ఏడిద శ్రీను, జనసేన ముఖ్య నాయకులు జన సైనికులు. తదితరులు పాల్గొన్నారు.

### అసమానుతలు లేని

# సమాజం కోసం పాటుపడండి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** సమ సమాజ స్థాపనే లక్ష్యంగా అసమానతలులేని లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు ఆదివారం ఉదయం స్థానిక ముక్తేశ్వరం పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్ టి యు 79వ వార్షికోత్స జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు పి దొరబాబు అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్ సాయి శ్రీనివాస్ సిపిఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ ఏఐటీయూసీ జిల్లా ఉమ్మడి అధ్యక్షులు కె.సత్తిబాబు, ఎస్టియు రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శివ ప్రసాద్‌లు పాల్గొన్నారు ముందుగా తాటిపాక మధు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ను ఆయన విమర్శించారు 32 మంది విద్యార్థుల ఆత్మ బలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమ ను బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టితుందని విమర్శించారు విశాఖ ఉక్కు ను పరిరక్షించ కుండా పక్కనే అనకాపల్లిలో మెటల్ ఉక్కు కు పరిశ్రమను తీసుకురావడం చాలా దారుణం అన్నారు. ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందని అన్నారు టెట్ ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈనెల 14న కడపలో జరిగే రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన ఎస్టియును బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శ పల్లంరాజు, కే వీ శేఖర్, మైనర్ బాబు కేకే నాయుడు, ఎస్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు

# రౌడీ షీటర్స్‌కు కౌన్సిలింగ్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్లకు పిలిపించి వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**కౌన్సిలింగ్ ముఖ్య ఉద్దేశాలు:**

శాంతిభద్రతల పరిరక్షణ: జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరోధించడం.

మార్గనిర్దేశం: రౌడీ షీటర్లు పాత నేర చరిత్రను విడిచిపెట్టి, మంచి జీవనం గడిపేలా వారికి మార్గనిర్దేశం చేయడం.

హెచ్చరిక: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంగా హెచ్చరించడం.

జీవనోపాధి: నేరాలకు దూరంగా ఉంటూ గౌరవప్రదమైన జీవనోపాధిని ఎంచుకోవాలని వారికి సూచించడం. ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ, "జిల్లాలో ఎలాంటి అసాంఘీక శక్తులు, రౌడీయిజం, గూండాయిజంలకు తావు లేకుండా చూస్తాము. నేరాలకు పాల్పడే వారిపై, పాత నేరాలను పునరావృతం చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోము. ఈ కౌన్సిలింగ్ ద్వారా వారు తమ ప్రవర్తనను మార్చుకుంటారని ఆశిస్తున్నాము," అని తెలిపారు.

### మైనర్లకు వాహనాలు ఇస్తే

# కఠినచర్యలు తప్పవు



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తొందరపాటుతో రహదారిలో వెళ్తున్నవారు ప్రమాదాల పాలవుతారని, మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని రాయవరం ఎస్సై సురేష్ బాబు హెచ్చరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో ఎస్సై సురేష్ బాబు తమ సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలను చేపట్టారు. ఈ క్రమంలో వాహనాలకు సరైన పత్రాలు లేని 17 మంది వాహనదారులకు రూ. 3145ల జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం వలన ఆ వాహనం నడుపుతున్న మైనర్లు తొందర పాటుతో వారికి వారే ప్రమాద బారిన పడడం లేదా రహదారిపై ప్రయాణం చేస్తున్న మరొకరి ప్రాణాలకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి వస్తుందని, అలా వాహనాలు ఇస్తే ఆ వాహనం యజమాని పై కఠిన చర్యలు తప్పవని తల్లిదండ్రులను హెచ్చరిస్తూ, కౌన్సిలింగ్ చేసి, ఫైన్ విధించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎఎస్ఐ రాంబాబు, కానిస్టేబుల్స్ మాధవరెడ్డి, వీరేంద్ర, విజయ్, శ్రీను, తదితర సిబ్బంది ఉన్నారు.

### సావిత్రి భాయ్ పూలే జయంతిని

# మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి : ఆప్టా



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** బడుగు, బలహీన వర్గాల మరియు ముఖ్యంగా మహిళా విద్య కొరకు జీవితాంతం వరకు పోరాడిన మహిళ సావిత్రి భాయ్ పూలే. దేశం లో మొట్టమొదటి బాలిక పాఠశాల ను ప్రారంభించి 1848 విద్యా ఉద్యమం ప్రారంభించిన సంఘ సంస్కర్త.ఆమె జయంతి అయిన జనవరి 3 తేదీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం కూడా సావిత్రి భాయ్ పూలే జయంతిని అధికారికంగా జరపాలని, అదే విధంగా ఆ రోజును మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి అని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి షానవాజ్ హుస్సేన్ మాజింద్రాణి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, మానవ వనరుల శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ బాబుకి లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేయడం జరిగింది.

# శ్రీ స్వామి వివేకానంద యోగాశ్రమంలో యోగా పోటీలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ స్వామి వివేకానంద యోగా ఆశ్రమంలో మోటూరు బైరవ స్వామి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా గురువు ఆధ్వర్యంలో ఆశ్రమంలో యోగా పోటీలు నిర్వహిం చారు. నిర్వహించిన పోటీల్లో అధిక సంఖ్యలో మూడు జిల్లాల నుంచి పిల్లల పాల్గొన్నారు. పాల్గొన్న పిల్లలకి ఫస్ట్ సెకండ్ థర్డ్ ప్లేస్ ఇచ్చి గౌరవించారు. యోగా గురువు రాష్ట్రపతి అవార్డు గ్రహీత నేషనల్ యోగా జడ్జి మాట్లాడుతూ వీరు త్వరలో ఫస్ట్ ప్లేస్ వచ్చిన వారికి పంజాబ్ లో జరిగే నేషనల్ యోగా పోటీలకు అదేవిధంగా సెకండ్ థర్డ్ వచ్చినవారుని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అయినా రాజమండ్రిలో 28వ తారీకు జరిగే జిల్లా పోటీలకు ఎంపిక చేస్తున్నట్టు భైరవ స్వామి అన్నారు యోగా గురువు ఆయుర్వేదం ఫిజియోథెరపీ వైద్యుడు జిమ్ యోగా శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నపిల్లలు చిన్నతనం నుంచి యోగా చేయడం వల్ల ఒత్తిడిని అధిగమించొచ్చు చదువు మీద ఏకగ్రీవ పెంచి ఉన్నత స్థాయికి అదే చదువులో ఎదగవచ్చు అని శ్రీనివాస్ గురూజీ అన్నారు.

### భారతరత్న అంబేద్కర్ జీవితం

# ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం

## అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన మంత్రి దుర్గేష్

**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రత్న, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోగలిగితే అదే ఆయనకు నిజమైన నివాళి అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని (డిసెంబర్ 6) పురస్కరించుకొని కేవీపీఎస్ చర్చ్ పేట యూత్ పెద్దల ఆధ్వర్యంలో నిడదవోలు చర్చ్ పేట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు, న్యాయవాది జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్ పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. నిరంతరం నిడదవోలు పరిశుభ్రత కోసం పాటు పడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనిది అని, అంబేద్కర్ విగ్రహం ముందు వారిని సన్మానించడం తనకు సంతృప్తినిచ్చిందని మంత్రి దుర్గేష్ అన్నారు. అనంతరం జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులకు, చర్చ్ పేట ఒంటరి మహిళలకు, వృద్ధులకు శ్రీ బూరుగుపల్లి లక్ష్మిపతి గారి జ్ఞాపకార్థం మరికొంత మంది దాతల సహకారంతో 200మందికి చలి దుప్పట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా కేవీపీఎస్ చర్చ్ పేట యూత్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ నాయకులు, సీఐటీయు నాయకులు కామ్రేడ్ దిద్దే దయామణి, సీఐటీయు నాయకులు కామ్రేడ్ గంటి కృష్ణ జీ డానియల్, జగ్జీవన్ రామ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బైపే రాజేశ్వర రావు, జన విజ్ఞాన వేదిక నాయకులు పైడియ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టీ.చిరంజీవి, బి.నాగేశ్వరరావు డి.సుబ్రహ్మణ్యం, పెయింటర్స్ యూనియన్ నాయకులు పి.చినబాబు, యు.ప్రభాకర్, టీ ముత్యాల రావు, టీ.సుధాకర్, గండి శేఖర్ యూత్ నాయకులు టీ.నానీ, టీ.నంగాల రాజు, లెనిన్ దాకే కృష్ణ, యు.మోషే సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ కులాల మధ్య చిచ్చు పెడుతుంది

## టీడీపీ అధికార ప్రతినిధి మహసేన రాజేష్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపి పార్టీ కులాలు మధ్య చిచ్చు పెడుతుంది అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్ అన్నారు. ఆదివారం సాయంత్రం కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విమానాలు ఆగి పోవడానికి మంత్రి లోకేష్ కారణమని వై ఎస్ ఆర్ పార్టీ నాయకులు ఆరోపణలు చేయడం లో నిజం లేదని చెప్పారు. రాష్ట్ర ఏంపీలను కేంద్ర మంత్రులు చేసిన ఘనత లోకేష్ ది అని, కావాలంటే జగన్ ను కేంద్ర మంత్రి చేస్తారని వ్యంగంగా అన్నారు. ఇటీవల కాకినాడ జిల్లాలో జరిగిన పాఠ శాలకు సంవంచిన గొడవలో కులాలు మధ్య చిచ్చు పెట్టేందుకు వైఎస్ పార్టీ ప్రయంతించిందని ఆగ్రహం వ్యక్తం చేసారు. విమానాలు ఆగిపోవడానికి లోకేష్ కారణమని చెప్పడంలో అర్ధం లేదని చెప్పారు. ఇటువంటి వ్యంగ్య ఆరోపణలు మానుకోవాలన్నారు. అవసరం అయితే జగన్ మా దగ్గరకు వస్తే కేంద్ర మంత్రి పదవి ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లబత్తుల అప్పారావు పాల్గొన్నారు.

### 104 సిబ్బందికి రావాల్సిన

# బకాయిలు ఇప్పించాలని డిమాండ్

**చింతూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్లో 104 సిబ్బంది జిల్లాలో పనిచేస్తున్న అందరూ ఉద్యోగస్తులు చింతూరులో సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తు ప్రజా సంజీవని గా పేరుతెచుకున్న 104 వాహనాల్లో పని చేస్తున్న సిబ్బంది మాత్రం సమస్యలు వలలో చిక్కుకొని వున్నారు.చాలి చాలని వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారని. అరబిందో సంస్థ నుండి రావాల్సిన బకాయిలు అనగా గ్రాట్యువిటీ ఎర్న్ లీవ్‌లు డబ్బుల విషయంలో అన్యాయం జరిగిందని కావున ప్రభుత్వం వెంటనే స్పందించి అరబిందొ నుండి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని. ప్రస్తుత యాజమాన్యం కూడా ఇప్పటివరకు నియామక పత్రాలు కానీ పే స్లీప్స్ కూడా ఇప్పటి వరకు ఉద్యోగులకు అందచేయ లేదని.. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ అధికారులు యాజమాన్యం యూనియన్ ప్రతి నిధులతో మీటింగ్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

**ముఖ్య డిమాండ్స్**

అరబిందో నుండి 104 ఉద్యోగులకు రావాల్సిన బకాయలు పూర్తి స్థాయిలో ప్రభుత్వం ఇప్పించాలి.

ఉద్యోగులు అందరికి నియామక పత్రాలు ఇప్పించాలి,

జీత బత్యాలు తెలిపే పే స్లిప్స్ ఇప్పించాలి,

ఎటువంటి అనుభవం లేని డేటా ఎంట్రీ ఆపరేటర్ కి మందుల నిర్వహణ బాధ్యతలు తొలగించాలి,

జీతాలులో వత్యాసం సవరించి ఇప్పటివరకు కోత విధించిన డబ్బులు అరియర్ రూపం లో ఇప్పించాలి,




రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఇచ్చిన శోకాజ్ నోటీసు మీద పునరాలోచన చేసి విచారణ చెయ్యాలి,

ప్రస్తుత మార్కెట్టు అనుగుణంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ కి జీతాలు 18,500/- పెంచాలి.,అదేవిదంగా 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి అయిన డ్రైవర్ లకు ఆటోమెటిక్ గా స్లాబ్ అమలు,

ప్రతి డివిజన్‌కి ఒక బఫర్ సిబ్బందిని నియమించాలి,

కార్మిక చట్ట ప్రకారం క్యాజువల్ లీవ్ లు ఇవ్వాల అని సమావేశంలో ప్రభుత్వాన్ని కోరడం జరిగినది ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పడాల సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు కోట్ల పవన్ కుమార్, బైపి రెడ్డి రామ్మూర్తి నాయుడు, (ట్రెజరీ వరప్రసాద్,నజీర్,) గుయ్యం నవీన్ కుమార్, ఎం శ్రీనివాస్, పైలట్ శ్రీనివాస్, 104 సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# డిసెంబర్ 8న జిల్లాలో 'మీకోసం' కార్యక్రమం

### కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డిసెంబర్ 8వ తేదీ సోమవారం రోజున జిల్లా మొత్తం వ్యాప్తంగా కలెక్టరేట్ నుండి గ్రామ/వార్డు సచివాలయాల వరకు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీకోసం" కార్యక్రమాన్ని యథాతథంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల అర్జీలను స్వీకరించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ఈ వేదిక ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్జీదారులు ముందుగానే meekosam.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అలాగే అర్జీల స్థితి తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చు. డివిజన్, మండల స్థాయిల్లోనే అర్జీలు ఇవ్వాలని ప్రజలకు సూచిస్తూ, అక్కడ స్వీకరించిన వినతులపై జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. రిసెప్షన్ డెస్క్, రాత సహాయకులు, వికలాంగులకు సౌకర్యాలు, తాగునీరు వంటి ఏర్పాట్లు చేయాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు. అధికారులు అందరూ వీడియో కాన్ఫరెన్స్‌కి తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. పౌర సేవల మెరుగుదలకు **WhatsApp Governance** నంబర్ 95523 00009 వినియోగంలో ఉన్నదని తెలిపారు.

### వైఎస్సార్ మండల అధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు ఆధ్వర్యంలో

# కోటి సంతకాల సేకరణ



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** నందిగామ గ్రామ పంచాయతీలో ఎమ్మెల్సీ అనంత బాబు రంపచోడవరం నియోజక వర్గ ఇంచార్జీ నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాట్లాడుతూ పేద ప్రజలకు విద్య వైద్య అందని ద్రాక్షల మారిందని సూపర్ సిక్స్ అనే మాయ మాటలు చెప్పి ప్రజలని మోసం చేశారు అని అన్నారు. నందిగామ గ్రామ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.గ్రామ కమిటీ అధ్యక్షుడుగా చిలకల నరసింహారావు ని ఏకగ్రీవం ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఇంజిలపు బేబీ, చంద్ర సుధాకర్ రావు, యలం సీతయ్య, చిలకల నరసింహారావు, గోదపర్తి నాగయ్యా, యలం సంతోష్, కసాని త్రిమూర్తులు, ఇంజిలపు శ్రీహరిచ చిలుకూరి నాగేశ్వరావు, ఇంజిలపు నాగేశ్వరావు, చిలకంటి రాంబాబు, పులుసు భాస్కరరావు, కంచర్ల నర్సయ్య, చిలకల రమేష్, సిద్ధి, రాజేష్, అరవ సతీష్, ఏళ్ళకి రాజేష్, చిలకంటి సురేంద్ర, ఏళ్ళకి కొండబాబు, తోటకూరి కృష్ణార్జునరావు, ఇంజిలపు రామోజీ, బియ్యన భద్రొరావు, ధర రమేష్, బియ్యన శ్రీనివాసరావు, పాలకుర్తి సంజీవరావు, ఆదినారాయణ, నాకరకంటి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# మండలాల వారీగా జిఎస్‌డబ్ల్యుఎస్ సేవల సమగ్ర పర్యవేక్షణ

### కలెక్టరేట్‌లో ఒక రోజు శిక్షణా కార్యక్రమం : వీణా దేవి

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో శనివారం జిఎస్‌డబ్ల్యూఎస్ వ్యవస్థలో అందిస్తున్న పౌర సేవలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందనీ జిల్లా జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి పి.వీణాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు చేరవలసిన సేవల అమలుపై ప్రాథమిక అంశాలను విపులంగా తెలియజేశారు. డివిజన్ పరిధిలో కొవ్వూరు, లాలా చెరువు లలో డివిజన్ స్థాయి కార్యాలయాలు ప్రారంభించడం జరిగిందన్నారు. విధులు, బాధ్యతలపై సిబ్బందికి సూచనలు చేస్తూ పారదర్శకత, సమర్థత పెంపుదల లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వీణా దేవి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జిఎస్‌డబ్ల్యూఎస్ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం రూపొందించిన వివిధ డాష్‌బోర్డులు, ఆన్‌లైన్ సమీక్షా పద్ధతులపై కొండలరావు శిక్షణ ఇచ్చారు. ప్రజల అర్జీల స్వీకరణ నుంచి పరిష్కారం వరకు తీసుకోవలసిన చర్యలపై మార్గదర్శకాలు వివరించారు. పౌర సేవలన్నీ సమయానికి, నాణ్యతతో అందించేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 21 మండలాల్లో 512 సచివాలయాలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయనీ. 4,067 మంది సిబ్బంది ప్రజా సేవలందించడంలో భాగస్వామ్యమవుతున్నారు. జిల్లాలో 6,54,119 కుటుంబాలు, మొత్తం 18,32,965 మంది జనాభాకు సేవలందించేందుకు రూపొందించిన ఆన్‌లైన్ వ్యవస్థలపై సమీక్షించారు. ప్రజల వినతులు, ధృవీకరణ పత్రాలు, సంక్షేమ పథకాల అనుసరణ తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. సచివాలయాల పనితీరు, ఉద్యోగులు & గృహాల వివరాల నివేదికలు, సచివాలయాల క్లస్టర్ అవలోకనం, హార్డ్‌వేర్ పంపిణీ & వినియోగం (వెబ్‌క్యామ్‌లు, హెడ్‌సెట్లు, ఎఫ్‌పి స్కానర్లు, ఆధార్ కిట్లు), మరణ నమోదు ఆడిట్, అధిక భద్రత ఆధారిత సర్టిఫికెట్లు, ఇకెవైసి & తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్, వాహన్ ఆధార్ సీడింగ్, "తల్లికి వందనం" & ఆటో సేవలో చెల్లింపులు, వైఫల్య నివేదికలు, కౌశలం డేటా, వాట్సాప్ డోర్ టు డోర్ ప్రచారం, పాఠశాల తనిఖీ నివేదికలు, ఎపి సేవా చెల్లింపులు, సిబ్బంది హాజరు వంటి అంశాలను మండలాల వారీగా సేవల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌డబ్ల్యూఎస్ ఇంచార్జి జిల్లా అధికారి పి.వీణాదేవి, కార్యాలయ సూపరింటెండెంట్ చిరంజీవి, జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, సహాయ కోఆర్డినేటర్ బాలకృష్ణ, ఏపీ ఆన్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కొండలరావు, డివిజన్, మండల జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఫంక్షనల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### చేవచచ్చి బ్రతుకుతున్న ఆంధ్ర ఎంపి, ఎమ్మెల్యేలకు

# ఆంధ్రుల త్యాగాలను గుర్తు చేద్దాం.. : మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జై ఆంధ్ర ఉద్యమ స్ఫూర్తిని రగిలిద్దాం. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ను సాధిద్దాం అని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఆంధ్రులను కోరారు. ఆంధ్రప్రదేశ్ పార్లమెంట్, ఎమ్మెల్యే సభ్యుల్లో అనేకమంది వందల కోట్లకు అధిపతుల మంటు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నప్పటికి చేవ లేని జీవితాలతో చేవ చచ్చి చట్ట సభల్లో ప్రజల కష్టాన్ని జీతాలుగా తీసుకుంటు సుఖ భోగాలు అనుభవిస్తున్నారు. పార్లమెంట్‌లో ఏ ఒక్క ఎంపి అయినా ప్రత్యేక హెూదా, విభజన హామీలు కోసం గళమెత్తిన సందర్భాలు ఉన్నాయా ! పోలవరం జాతీయ ప్రాజెక్ట్ సాధన కోసం, డివిజన్ తో కూడిన రైల్వే జోన్, రామాయపట్నం మేజర్ పోర్ట్, పూర్తిస్తాయి ప్రభుత్వ సంస్థగా కడప ఉక్కు ఫ్యాక్టరి, కేప్టివ్ మైన్స్ తో గల పూర్తి స్థాయి ప్రభుత్వ సంస్థగానే విశాఖ ఉక్కు నిర్వహణ, హైదరాబాద్ లోగల సుమారు లక్ష కోట్లు పైభడిన 52% , 48% నిష్పత్తి వాటా గల విభజన ఆర్థిక వాటా, 38 వేల కోట్ల కాకినాడ పెట్రో కెమికల్ కంపెక్స్, ఇంకా అనేక విభజన హామీల కోసం ఆంధ్రప్రదేశ్ నుండి పార్లమెంట్ లో గళమెత్తిన ఏ ఒక్క ఎంపి అయినా ఉన్నారా! అదే స్థాయిలో ఆంధ్ర రాష్ట్ర ఎమ్మెల్యేలు సైతం మన ఎంపిలతో సమానంగా పోటి పడుతూ ప్రజల కష్టాన్ని జీతాలుగా తీసుకుంటున్నారు. చేవ లేని చేవ చచ్చి బ్రతుకుతున్న మన పోకచెక్క నేతలకు ఆంధ్ర రాష్ట్ర ఘన చరిత్రను, ఆంధ్రుల త్యాగాలను, ఆంధ్రుల పౌరుషాన్ని , వారి ఆగ్రహాన్ని గుర్తు చేయాల్సిన సమయం ఆశన్నమైనది. మన ఎంపిలు, ఎమ్మెల్యేల కన్నా సర్పంచ్ లు, కౌన్సిలర్స్ కొంతమేరకు ఆత్మభిమానంతో ప్రజలకు అందుబాటులో వుంటు వారి భాద్యతలను నిర్వహిస్తున్నారని, ఎమ్మెల్యే, ఎంపిల్లో మార్పు రాకపోతే మరో నేపాల్, శ్రీలంక ఉద్యమ తిరుగుబాట్లు తప్పవువని, ఉరికించుకుంటారో, ప్రత్యేక హెూదా, విభజన హామీల కోసం పార్లమెంట్, అసెంబ్లీ ల్లో గళ మెత్తుతారో నేతలే నిర్ణయించుకోవాలని ఆయన హెచ్చిరించారు. ఆంధ్రుల మోనం, సహనం ఆంధ్ర రాష్ట్ర సంపదను, మన బిడ్డల భవిష్యత్ ను దోచుకోవటానికి మనమే మార్గం చేస్తున్నట్టుగా వుంది. ప్రస్తుత పాలకుల్లో ప్రధాన నేతలకు ఆంధ్రప్రదేశ్ మట్టి వాసన తెలవదు. రాజకీయాలను మాత్రమే ఆంధ్ర రాష్ట్రంలో సాశిస్తుంటారు. వీరి నివాసాలు , ఆస్తులు, వ్యాపారాలు మొత్తం ప్రక్క రాష్ట్రంలోనే వీరికి అవసరం అయినప్పుడు ప్రాంతీయ



విద్వేషాలను రెచ్చగొడుతు సొంత ప్రయోజనాలు పొడుతున్నారు. కేసీఆర్ వంటి వారి విష వారసులను అవసరం మేరకు రెచ్చ గోడుతూ ఇరు రాష్ట్రాల మధ్య అగ్గి రాజేస్తు వారి సొంత రాజకీయ ప్రయోజనాలను సాధించుకుంటున్నారు . ప్రస్తుత పాలకులకు ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్ , ఆత్మగౌరవం కన్నా వారి కుటుంబాలకు తర తరాలు తరగని ఆస్తులు, రాజకీయ అధికారమే ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్ ను సర్వనాశనం చేస్తున్నారు. హైదరాబాద్ నడిబొడ్డున రవీంద్ర భారతి స్టేడియం వద్ద ఎస్ పి బాలసుబ్రహ్మణ్యం విగ్రహం విషయంలో ఒక ప్రాంతీయ మీడియా ముసుగు ఉన్మాది జరిపిన దాడిని తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల్లో ఏ ఒక్కరు ఖండించకపోవటం వారి విష రాజకీయాలకు నిదర్శనం. ఆంధ్ర రాష్ట్రంలో గల అపార సంపదను ఇతర రాష్ట్రాల రాజకీయ అవసరాలకు దోచిపెట్టడానికి, మన ఆంధ్రుల శ్రమను సొంత మార్గాలకు దారి మళ్ళించుకోవటానికి మాత్రమే ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు . ఆంధ్ర రాష్ట్రం నుండి ప్రాతినిత్యం వహిస్తున్న ఎంపిలు, ఎమ్మెల్యేలు సొంత నియోజకవర్గాల అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగం లేదు. కనీసం ఇంటి పనిమనిషి కి వున్న విశ్వాసం కూడా మన రాష్ట్రం నుండి చట్ట సభల్లో ప్రాతినిత్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులకు లేక పోతుందని ఆయన తీవ్ర ఆవేదన చెందారు. పూర్తి స్థాయి రాజకీయ మార్పుతో ఆంధ్రప్రదేశ్‌లో సంపదను సృష్టిద్దాం, సంపదను సాధిద్దాం . భూమి హక్కును సామాన్యుల సొంతం చేద్దాం. గతించిన ఆంధ్ర రాష్ట్ర పౌరుషాన్ని ఢిల్లీ పాలకులకు రుచి చూపిద్దాం. బానిసలుగాను, నిరు పేదలగాను, అంటరాని వారిగాను బ్రతకటం కన్నా బిడ్డల అభ్యున్నతి కోసం, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం పేదరికం లేని సమాజాన్ని సాధించుకుందాం . ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రగతికి పదంలో నడిపిద్దాం. చేవ లేని, పౌరుషం లేని, సత్తా లేని నర్తనశాల నేతలకు జై జేలు కొట్టటం మానేసి సమర్థులైన నేతలకు పట్టం కట్టి ఇన్నాళ్లు చట్ట సభలకు పట్టిన కళంకాన్ని తుడిచిద్దాం. కదలి వలే ఉప్పొంగిన ఆంధ్రుల పౌరుషాన్ని కడలి కెరటాలకు చూపిద్దాం. ఆంధ్ర రాష్ట్ర నేతలు మాత్రమే పౌరుషం చచ్చి బ్రతుకుతున్నారు . ఆంధ్రులు కారు అని యావత్ ప్రపంచానికి చాటిచెప్పుదాం. మన రాష్ట్ర సంపద మనది కావాలి . ఇతరుల దోపిడీకి కాదు అని నిరూపిద్దాం. ఆంధ్రుల మంచితనాన్ని అగౌరవ పరిస్తే ఆధ్రుల తిరుగుబాటు దేశ వ్యాప్తంగా ఆదర్శం కాగలదని ఆయన సూటిగా హెచ్చిరించారు. పూర్తి స్థాయి రాజకీయ మార్పు ఆంధ్రప్రదేశ్‌లో మొదలవుతుందని, దొరల పాలనకు చమరగీతం తప్పదని, పాలనను ములాల్లో నుండి సంస్కరించుకుంటామని, ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ కట్టప్పలకు కాలం చెల్లే రోజులు దగ్గరపడ్డాయని గుర్తు చేసారు. ఆంధ్రప్రదేశ్‌లో గల 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లోను జై ఆంధ్ర ఉద్యమ స్ఫూర్తిని తీసుకొస్తామని, ఆనాటి ఉద్యమ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ ను సంపన్న రాష్ట్రంగా నిరూపించటం తధ్యమని, జై ఆంధ్ర నినాదం స్వాతంత్ర్య పోరాటానికి నాందిగా నిలిచిన వందేమాతరం అనే వజ్ర సంకల్పంగా ఆంధ్రులు బావించే రోజులు ముందు ముందు వున్నాయని, 2029 నాటి చట్ట సభల్లో సమర్థులైన యోధులు ప్రాతినిత్యం వహించటం ఖాయమని, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ కేరఫ్ హైదరాబాద్ వ్యాపార రాజకీయ పార్టిలు కనుమరుగవ్వటం తప్పదని, జై ఆంధ్రప్రదేశ్, సేవ్ ఆంధ్రప్రదేశ్ నినాదం ప్రతి ఆంధ్రుడి గురుతర బాధ్యతగా చేతబూనే విధంగా ప్రత్యామ్నాయ రాజకీయ నిర్మాణ దిశగా ఇప్పటికే ఎంతో మంది స్వచ్ఛమైన ఆంధ్రుల తోను, యువత తోను సంప్రదింపులు విస్తృతంగా జరుగుతున్నాయని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ధీమా వ్యక్త పరిచారు. సభకు అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించార. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ డి వి రమణమూర్తి, ఎమ్‌డి హుస్సేన్, దుడ్డే సురేష్, బర్ల సతీష్, దోషి నిషాంత్, వాడపల్లి జ్యోతిష్, గుడ్ల సాయి దుర్గాప్రసాద్, దుడ్డే త్రినాద్, బసా సోనియా, వల్లి శ్రీనివాసరావు, యర్రా బాల మురళి కృష్ణ, అల్లాడ రమేష్, మాసా అప్పాయమ్మ, సుంకర వెంకట భాస్కర రంగారావు, కాకర ప్రసాద్, కూరాకుల నాగమణి, కందివలస రమణ, కందివలస హైమావతి, మేకల కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.కె.ఆర్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉచిత మెడికల్ క్యాంప్

### యువతులు చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని సూచించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

### మరిన్ని మహిళా కళాశాలలకు ట్రస్ట్ తరఫున సేవలందిస్తామని తెలిపిన డాక్టర్ యాళ్ళ ప్రదీప్ సుకుమార్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** యాళ్ళ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, హితకారిణి సమాజం నిర్వహిస్తున్న ఎస్.కె.ఆర్ ఉమెన్స్ హాస్టల్‌లో ఉచిత రక్తపరీక్షలతో కూడిన మెడికల్ క్యాంప్‌ను రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతకు బలం విద్యేనని, విద్య ద్వారా మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ఈ దిశగా శతాబ్దం క్రితమే వెలుగులు నింపిన సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం సేవలు అపూర్వమని పేర్కొన్నారు. ఆయన స్థాపించిన హితకారిణి సమాజం నేటికీ మహిళా విద్య కోసం చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. హాస్టల్ లో నివసిస్తున్న యువతులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా ప్రతి ఆరు



నెలలకు ఒకసారి రక్తపరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ఉచిత మెడికల్ క్యాంపు ద్వారా రక్తపరీక్షలను నిర్వహించిన యాళ్ళ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హితకారిణి సమాజం చైర్మన్ డా. యాళ్ళ ప్రదీప్ సుకుమార్ మాట్లాడుతూ, ఇటీవల ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతతో తనను సంప్రదించగా, వారి రక్తపరీక్షల్లో హిమోగ్లోబిన్ శాతం చాలా తక్కువగా గుర్తించడంతో, మిగతా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి కూడా తెలుసుకోవటం అత్యవసరమని భావించామని తెలిపారు. అదే ఆలోచనతో, తన కుటుంబ సభ్యుల సహకారంతో యాళ్ళ చారిటబుల్ ట్రస్ట్ తరఫున హాస్టల్‌లో నివసిస్తున్న సుమారు 250 మంది విద్యార్థినులకు రూ.30,000 విలువ చేసే రక్తపరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో రాజమండ్రి నగరంలోని అన్ని మహిళా కళాశాలల్లో ఇటువంటి ఆరోగ్య పరీక్షా కార్యక్రమాలను విస్తరించే సంకల్పంతో ఉన్నట్లు తెలిపారు. మహిళా విద్య కోసం జీవితాంతం శ్రమించిన కందుకూరి వీరేశలింగం ఆశయాలను కొనసాగించడానికి కృషి చేయడం ట్రస్ట్ బోర్డు సభ్యులంతా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మెడికల్ క్యాంప్ అనంతరం హాస్టల్ విద్యార్థినుల అత్యవసర పరిస్థితులలో ఉపయోగపడే సుమారు రూ.6,000 విలువ చేసే ఎమర్జెన్సీ మెడికల్ కిట్‌ను హాస్టల్ వార్డెన్ శ్రీమతి ఎం. విశాలాక్షికి ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యాళ్ళ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, హితకారిణి సమాజం ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆదిరెడ్డి వీర వెంకట సత్యనారాయణ, బందారు శ్రీనివాసరావు, మేడపాటి సాయి భాగ్యలక్ష్మి, కుచ్చెర్లపాటి లలితారాణి, చెరుకుమిల్లి అనంత సత్య నాగవల్లి, కొడమళ్ళ శ్రీనివాసరావు, తణుకు శేషు కుమారి మరియు కిలారి వెంకట నాగలక్ష్మి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.





### కానూరు శ్రీ కొండాలమ్మ తల్లి అమ్మవారి దేవస్థాన కమిటీకి

# మంత్రి దుర్గేష్ శుభాకాంక్షలు

**ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కందుల దుర్గేష్ హాజరు**
**అంగరంగ వైభవంగా ఆలయ చైర్మన్, ధర్మకర్తల ప్రమాణ స్వీకారం**
**ఆలయ అభివృద్ధితోపాటు, సేవా కార్యక్రమాలు చేయాలని దేవస్థాన కమిటీ కృషి చేయాలని సూచన**
**ఆలయ అభివృద్ధికి, దేవస్థానం కమిటీకి మంత్రిగా సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ**



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు గ్రామంలో కొలువైన శ్రీ కొండాలమ్మ తల్లి అమ్మవారి ఆలయం నందు ఆలయ నూతన చైర్మన్,ధర్మకర్తల ప్రమాణ స్వీకార మహోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మంత్రి కందుల దుర్గేష్ ను ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో శ్రీ కొండాలమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్ గా బొబ్బిలి దుర్గారావు, డైరెక్టర్లుగా టి.దుర్గాదేవి, టి.ఆంజనేయులు, కే.దొరబాబు, జె.శ్రీను, బి.నాగ త్రివేణి, టి.సీతా రామలక్ష్మి, భావన ధర్మ శేఖర్, పెద్దింటి విజయలక్ష్మి, డివివి రమణ( అర్చక ఎక్స్ అఫీషియో మెంబర్) తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధితోపాటు, సేవా కార్యక్రమాలు చేయాలని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందేందుకు దేవస్థాన కమిటీ కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంతో ప్రాశస్త్యమున్న ఈ ఆలయ అభివృద్ధికి, దేవస్థానం కమిటీకి మంత్రిగా సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కోరిన వారికి కొంగు బంగారంగా నిలిచే తల్లి కొండాలమ్మ తల్లి అన్నారు. స్థానిక ప్రజల కోరిక మేరకు ఎన్నికలకు ముందు కొండాలమ్మ దర్శనం చేసుకున్న తాను అమ్మ ఆశీర్వాదం, ప్రజల అభిమానంతో ఎమ్మెల్యేనై అనంతరం మంత్రిని అయ్యానన్నారు. సౌమ్యుడు, దాన గుణం ఉన్న వ్యక్తి బొబ్బిలి దుర్గారావు దేవస్థాన కమిటీ చైర్మన్ గా పనిచేసేందుకు నూటికి నూరు శాతం అర్హులని మంత్రి దుర్గేష్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కానూరు గ్రామాన్ని, నిడదవోలు నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం కానూరు- ఉసులుమర్రు రోడ్డు సీసీ రోడ్డు పనులు ప్రారంభించామని, అదే రోడ్డు పనులను పెరవలి వరకు పొడిగించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 16 నెలల కాలంలో రూ. 3 కోట్ల పై చిలుకు ముఖ్యమంత్రి సహాయ నిధులు ( సీఎంఆర్ఎఫ్ ) నియోజకవర్గ ప్రజలకు అందించామని, మరీ ముఖ్యంగా కానూరు గ్రామానికి అత్యధికంగా అందించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రజా రాజధాని అమరావతిని గత ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసిందని మంత్రి దుర్గేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వ నేతలు నీరుగార్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో తిరిగి రాజధాని అమరావతి నిర్మాణం చేపట్టామని, పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించామని మంత్రి దుర్గేష్ వివరించారు. వాటిని పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. టిడిపి, బిజెపి, జనసేన మూడు పార్టీల కలయికతో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ పరుగులు పెడుతోందన్నారు. కూటమిలో అందరూ ఐకమత్యంగా ఉండి రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధికి కారకులవుదామన్నారు. నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, అడిగిన వెంటనే రాష్ట్రంలోనే తొలిసారి నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ. 11 కోట్లు విడుదల చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిడదవోలు నియోజకవర్గానికి మరిన్ని నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. తద్వారా నియోజకవర్గంలో పుంత రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపడతామన్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఆర్ అండ్ బి నిధులతో చేపట్టిన చివటం రోడ్డును చూసి స్థానిక ప్రజలు ధన్యవాదాలు చెప్పారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పుడు, అది ప్రజలకు సత్ఫలితాలు అందించినప్పుడే రాజకీయ నాయకుడిగా తమకు సంతృప్తి కలుగుతుందని అన్నారు. నిడదవోలు మున్సిపాలిటీకి స్పెషల్ గ్రేడ్ హోదా ఇచ్చిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కు కృతజ్ఞతలు చెబుతూ త్వరలోనే ఆ హోదాలో పట్టణ అభివృద్ధికి భారీగా నిధులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఆర్ఓబి నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు క్యాబినెట్లో మంత్రిగా పనిచేయడం తనకు దొరికిన అదృష్టమని మంత్రి దుర్గేష్ అన్నారు.

### కష్టాల్లో ఉన్న వారికి

# అండగా ఉంటాం..

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కష్టాలు... ఇబ్బందుల్లో ఉన్న పేద విద్యార్థులకు తాము... తమ కూటమి ప్రభుత్వం అండగా ఉంటామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక లింగంపేట వాంబే గృహాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న కె యశ్వంత్, 5వ తరగతి చదువుతున్న కె లహరి అనే పేద విద్యార్థులకు తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. పార్టీ తరపున సహకారం అందేలా చూస్తామన్నారు. కాగా తమ ట్రస్టు తరపున నిత్యం ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటున్నామన్నారు. పేద విద్యార్థులకు ఫీజు నిమిత్తం, అలాగే అనారోగ్యంతో బాధపడే పేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. కాగా ఆరోగ్యకర సమాజం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సంకల్పమన్నారు. అందుకే ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలు వర్తించని పేదలకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందచేస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సంకల్పమన్నారు. అందుకే ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవలు వర్తించని పేదలకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందచేస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాజమండ్రిలో సీఎం సహాయ నిధి నుంచి ఒక్కచెక్కు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మధురపూడిలో ఘనంగా దుర్గమ్మ

# 36వ జాతర మహోత్సవం

**ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలువురికి సత్కారం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం మధురపూడి గ్రామానికి చెందిన మాతృశ్రీ కనకదుర్గమ్మతల్లి 36వ జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం దుర్గమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని వివిధ ఫల, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడును చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బత్తులకు పూలమాలలు వేసి సాల్వో ఘనంగా అమ్మవారి మెమెంటో అందజేశారు. వైయస్సార్సీపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా, నల్లమిల్లి వెంకన్నబాబు దంపతులు, రాజానగరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి



నీరుకొండ వీరన్న చౌదరి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు ఆకుల శ్రీనివాస్ (బుజ్జి), కోనే రామకృష్ణ, మేడిశెట్టి సాయి, గణేశుల పోసియ్య, నందే ప్రసాద్, బత్తిన త్రిమూర్తులు, పిల్ల వీర వెంకటరావు, గణేశుల వెంకన్న, ఆకుల రామకృష్ణ, జనసేన పార్టీ నాయకులు మేడిశెట్టి శివరాం, అడ్డాల శ్రీను, ఎర్రంశెట్టి పోలరావు, తన్నీరు తాతాజీ, భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మను దర్శించుకున్న కంబాల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు కనకదుర్గమును దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కోరుకొండ మండలం మధురపూడిలో కొలువైన మాతృశ్రీ కనకదుర్గమ్మతల్లి 36వ జాతర మహోత్సవ సందర్భంగా కంబాల అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా కంబాల పదివేల రూపాయలు విరాళం ఆలయ కమిటీసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కంబాల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హిందూ ధర్మ పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీసభ్యులు కంబాల శ్రీనివాసరావుకు పూలమాల వేసి సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు, ఆలయ కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సమాచార శాఖ అధికారిపై

# దాడి హేయమైన చర్య

**- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**- తూర్పు గోదావరి, కోనసీమ జిల్లా కలెక్టర్లకు ఐఅండ్ పిఆర్ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శనివారం నిడదవోలు నుంచి అమలాపురం వెళ్తున్న కోనసీమ జిల్లాకు చెందిన సమాచార శాఖ అధికారి సి.హెచ్. శ్రీనివాస్‌పై రాజమహేంద్రవరంలో జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖ అధికారుల మరియు ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండిస్తోంది. రాజమహేంద్ర వరంలోని కోటిపల్లి బస్టాండు వద్ద ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, బస్సు మెట్ల వద్ద అడ్డుగా నిలబడవద్దని హితవు పలికినందుకు.. ఒక ప్రైవేటు కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఆయనపై భౌతిక దాడికి దిగి, గాయపరచడం అత్యంత హేయమైన చర్య. బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగి, సాటి ప్రయాణికుల సౌకర్యం కోసం చెప్పిన మాటను వినిపించుకోకపోగా, దాడికి తెగబడటం అనాగరికమైన ప్రవర్తన. ఈ ఘటనపై మా సంఘం తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన ఆవశ్యకతను ఈ ఘటన గుర్తుచేస్తోంది. కావున, తూర్పు గోదావరి మరియు కోనసీమ జిల్లా కలెక్టర్లు, అలాగే పోలీస్ ఉన్నతాధికారులు ఈ ఘటనపై తక్షణమే స్పందించి, విచారణ జరిపించాలని కోరుతున్నాము. దాడికి పాల్పడిన విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పత్రికాముఖంగా విజ్ఞప్తి చేస్తున్నాము.

### త్వరలోనే దివ్యాంగుల కోసం

# కమ్యూనిటీ హాల్

**దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తానని మంత్రి కందుల దుర్గేష్ భరోసా**



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తారని, త్వరలోనే దివ్యాంగుల కమ్యూనిటీ హాల్ ను మంజూరు చేస్తామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని చర్చిపేటలో జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 66వ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ మాసోత్సవానికి మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి పలువురు దివ్యాంగులకు తినిపించారు. ఈ సందర్భంగా అన్ని అవయవాలు బాగుండి ఏమీ చేయలేని వారిని ఉదహరిస్తూ దివ్యాంగుడైన ర్యాలి శివ డాక్టరేట్ సాధించడం పట్ల మంత్రి దుర్గేష్ హర్షం వ్యక్తం చేసి సంబంధిత పత్రాన్ని అందించి ప్రశంసించారు. అనంతరం దివ్యాంగుల కోసం కృషి చేస్తున్న శివ చేస్తున్న కృషిని అభివర్ణిస్తూ ఘనంగా సత్కరించారు. శివ సాధించిన డాక్టరేట్ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలుస్తుంది అన్నారు. అదేవిధంగా విభిన్న ప్రతిభావంతుల కోసం చేసిన సేవలను గుర్తిస్తూ మదర్ థెరిస్సా అవార్డు పొందిన వంగా కృపా వరప్రసాద్ ను మంత్రి దుర్గేష్ అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం కమ్యూనిటీ హాల్ కేటాయించలని పలువురు చేసిన విజ్ఞప్తి మేరకు తాను మున్సిపల్ అధికారులతో మాట్లాడాలని, అతి త్వరలోనే మంజూరు అవుతుందని భరోసానిచ్చారు. ఇప్పటికే రెండు మూడు గుర్తించామని, అందులో ఒకటి కేటాయిస్తామని స్పష్టం చేశారు. అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని కార్యక్రమాలు చేపడతానని వెల్లడించారు. దివ్యాంగుల్లో అపారమైన శక్తి సామర్థ్యం, అంతులేని ఆత్మస్థైర్యం ఉంటుందని, అవకాశాలు ఇస్తే ప్రతి ఒక్కరు అద్భుతాలు సృష్టించగలరని వారిలో ధైర్యం నింపారు. దివ్యాంగులు సైతం అన్ని రంగాల్లో తమ ప్రతిభ కనబరుస్తూ రాణిస్తున్నారని పేర్కొన్నారు.

### దళితులు ఇకనైనా

# రాజ్యాధికార దిశగా పయనించాలి

**త్వరలో నియోజకవర్గ దళిత ఉమ్మడి కమిటీ : పిట్ట వరప్రసాద్**




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో మాల మాదిగ దళిత ప్రజలందరూ ఏకతాటిపై కొచ్చి అధికార దిశగా పయనించాలని అంబేద్కర్ వాది పిట్ట వరప్రసాద్ అన్నారు. ఆదివారం కోరుకొండ ఎస్సి వెంచర్ వద్ద కోరుకొండ మండల దళిత ఆత్మీయ కలయిక ఘనంగా నిర్వహించారు. గుమ్ములూరు సర్పంచ్ రాజానగరం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నక్కా రాంబాబు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి మాల,మాదిగ దళిత నాయకులు పెద్ద ఎత్తున విచ్చేసి, ఇకనైనా అందరం ఏకతాటిపైకి వచ్చి దళితులపై జరుగుతున్న అక్రమాలకు స్పందించి, తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. దేశవ్యాప్తంగా మాలలు మొదటి స్థానంలోనూ, మాదిగలు నాలుగోవ స్థానంలో, పార్లమెంట్లో సుమారు 135 మంది ఎంపీలు ఉన్న రెండు కులాలు ఏకతాటిపై లేకపోవడంతో అధికారం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ర పార్టీల వారు రెండు కులాల మధ్య రిజర్వేషన్లు పేరుతో చిచ్చుపెట్టి, అవుట్సోర్సింగ్ విధానంతో మనందరికీ అన్యాయం జరుగుతుందన్నారు. దళిత సత్తా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బచ్చుల కామేశ్వరరావు మాట్లాడుతూ రెండు కులాల దళితులపై అగ్ర కులాలు దాడులు చేస్తూనే ఉన్నారని, మనందరం ఏకమై ఎదుర్కొనే రోజులు రావాలన్నారు. పిల్లలను ఉన్నత విద్యను చదివించి, సమాజం పై అవగాహన పెంపొందించాలన్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి, ఇంటికి డోర్ డెలివరీ వంటి అంశాలను ప్రస్తావించారు. మండలంలోని గాడాలకు చెందిన పాముల శ్రీను పై అగ్రకులాలు దాడితో, దళితులు స్పందించిన తీరును ప్రశంసిస్తూ, ఇదే వరవడి కొనసాగితే భవిష్యత్తు మనదే అన్నారు. నక్కా రాంబాబు మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గంలో త్వరలో మాల,మాదిగ ఐక్య కమిటీ వేసి, ఇదే విధానం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిలా చర్యలు చేపడదామన్నారు. ఈ కార్యక్రమంలో కందికట్ల జయకర్, పిట్ట కృష్ణ, పండా అబ్బులు, కంచుమర్తి దుర్గారావు, కొయ్యే సామ్యూల్, ఇందుగుమిల్లి సత్యనారాయణ, సన్నపు వెంకట్, మార్టిన్ లూథర్, డాక్టర్ వీర్రాజు, ఖండవిల్లి లక్ష్మి, కొల్లపురత్నం, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

## సినీ వాయిస్ CINEMA



# సోషల్ మీడియాని షేక్ చేస్తున్న ఎన్టీఆర్ కొత్త లుక్..

కానీ సడన్గా ఎన్టీఆర్ కి సంబంధించిన కొత్త లుక్ వైరల్ అవ్వడంతో ఇప్పటివరకు ఎన్టీఆర్ ని ట్రోల్ చేసిన నోళ్ళన్నీ మూత పడిపోయాయి. సినీ సెలబ్రిటీలు ఏం చేసినా కూడా అది సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గానే మారుతుంది. వాళ్ల వెరైటీ డ్రెస్ వేసినా.. కొత్త లుక్ లో కనిపించినా అభిమానులు ఆ లుక్ ని తెగ వైరల్ చేస్తూ ఉంటారు. అయితే తాజాగా జూనియర్ ఎన్టీఆర్ కి సంబంధించి కొత్త లుక్ వైరల్ అవుతోంది. ఆ ఫోటోలో జూనియర్ ఎన్టీఆర్ చాలా స్టైలిష్ గా కనిపిస్తున్నారు. జీన్స్ ప్యాంట్,షర్ట్ ధరించిన ఎన్టీఆర్.. స్టైల్ గా కాలు మీద కాలు వేసుకొని కూర్చొని గాగుల్స్ పెట్టుకొని.. చేతులు కట్టుకొని సోఫాలో కూర్చున్న ఒక ఫోటో ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది.. ఈ ఫోటోలో ఎన్టీఆర్ తన చేతికి పెట్టుకున్న వాచ్ కూడా వైరల్ అవుతుంది. ప్రస్తుతం ఈ రెండు ఫోటోలు ఇంటర్నెట్లో చక్కర్లు కొట్టడంతో చాలామంది జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఈ ఫోటోలను తెగ వైరల్ చేస్తున్నారు. అలాగే ఈ ఫోటోలో ఎన్టీఆర్ చాలా సన్నగా కూడా కనిపిస్తున్నారు. అయితే తాజాగా మలబార్ యాడ్ లో కనిపించిన జూనియర్ ఎన్టీఆర్ పై ట్రోల్స్ రాగా..ఈ ఫోటోపై మాత్రం ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. సోఫాలో కూర్చున్న ఎన్టీఆర్ చాలా స్టైలిష్ గా ఉన్నారని ఆయన లుక్ అద్భుతంగా ఉంది అని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. అయితే మలబార్ యాడ్ పై ట్రోలింగ్ జరిగిన రెండు రోజులకే మళ్ళీ ఎన్టీఆర్ కి సంబంధించిన న్యూ లుక్ నెట్టింట్లో వైరల్ అవ్వడంతో చాలామంది షాక్ అవుతున్నారు. ఇదేంటి ఇంత తొందరగా ఎన్టీఆర్ లుక్ చేంజ్ చేసుకున్నారు అని షాక్ అయిపోతున్నారు. అయితే మలబార్ యాడ్‌లో జూనియర్ ఎన్టీఆర్ గుబురు గడ్డంతో చాలా సన్నబడి కనిపించడంతో కొంతమంది నెటిజన్స్ ఆయన లుక్ పై ట్రోలింగ్ చేశారు.ఇదేంటన్న ఇలా మారిపోయావ్.. బక్క చిక్కిపోయి గుబురు గడ్డంతో ఉన్నావ్.. అసలు గుర్తు పెట్టలేకపోతున్నాం అంటూ కామెంట్స్ చేశారు. కానీ సడన్గా ఎన్టీఆర్ కి సంబంధించిన కొత్త లుక్ వైరల్ అవ్వడంతో ఇప్పటివరకు ఎన్టీఆర్ ని ట్రోల్ చేసిన నోళ్ళన్నీ మూత పడిపోయాయి. ఇక ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో డ్రాగన్ మూవీ చేసిన సంగతి మనకు తెలిసిందే. ఈ సినిమా కోసమే ఎన్టీఆర్ తన లుక్ మొత్తం చేంజ్ చేసుకున్నారు. దేవర సినిమాలో తన లుక్ తో అందరినీ ఆకట్టుకున్న ఎన్టీఆర్.. ప్రశాంత్ నీల్ సినిమా కోసం చాలా సన్నబడిపోయారు. ఈయన ప్రశాంత్ నీల్ మూవీ కోసం సన్నబడడంతో ఎంతోమంది నెటిజన్లు ఎన్టీఆర్ కి ఏమైపోయింది..? ఆరోగ్యం బాలేదా..?ఎందుకు అంత సన్నబడిపోయారని అభిమానులు ఆందోళన చెందారు. కానీ ప్రశాంత్ నీల్ సినిమా కోసమే అలా సన్నబడ్డారని ఆ తర్వాత అర్థమైంది. ప్రశాంత్ నీల్ డైరెక్షన్ చేస్తున్న సినిమా షూటింగ్ కొత్త షెడ్యూల్ రేపటి నుండి ప్రారంభం కాబోతున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో ఓ టాక్ వినిపిస్తుంది. అలాగే ఈ సినిమాలో ఎన్టీఆర్ బాడీ డబుల్ లేకుండా స్వయంగా స్టంట్స్ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ ల మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. మరి ఈ సినిమా అభిమానులను ఏ విధంగా ఆకట్టుకుంటుందో చూడాలి.



## అదృష్టం అంటే

# ఈ తెలుగమ్మాయిదే!

కొందరికి సినిమా అవకాశాలు అన్నవి అనుకోకుండా వస్తాయి. కెరీర్ ప్లానింగ్ లో సినిమా లేకపోయినా? అనూహ్యంగా వచ్చిన అవకాశాలతో ఈ రంగంలో స్థిరపడిన వారు చాలా మంది ఉన్నారు. నటుడు రాహుల్ రామకృష్ణ ఇండస్ట్రీలో ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే సక్సెస్ అయ్యాడు. టాలీవుడ్ లో స్థిరపడ్డాడు. అర్జున్ రెడ్డి చిత్రం అతడి జీవితాన్నే మార్చేసింది. ఇంకా ఇలాంటి వాళ్లు చాలా మంది ఉన్నారు. తెలుగు అమ్మాయి శివానీ నాగరం కడూఅ అలాగే క్లిక్ అయినట్లు తెలిపింది. శివానీ సినిమాల్లోకి రావాలని ముందెప్పుడు అనుకోలేదంది. ఓ షార్ట్ ఫిల్మ్ కోసం తొలిసారి కెమెరా ముందుకొచ్చింది. ఆ గుర్తింపు తోనే సినిమా అనే థాట్ మనసులో మొదలింది. అటుపై అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్‌లో ఛాన్స్ అందుకుంది. ఆ చిత్ర దర్శక, నిర్మాతలు యూ ట్యూబ్ లో చూసి అమ్మడిని అప్రోచ్ అవ్వడం..పాత్రకు సెట్ అవుతుందని భావించి ఎంపిక చేసారు. తొలి సినిమా షూటింగ్ సమయం లో చాలా టెన్షన్ పడింది. కానీ ఇప్పుడా టెన్షన్ పోయి నటిగా ధైర్యంగా పని చేస్తోంది. ఆ తర్వాత నటించిన లిటిల్ హార్ట్స్ కూడా మంచి విజయం అందుకుంది. ప్రస్తుతం కొత్త అవకాశాలు బాగానే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాలమే తనని స్టార్‌గా మార్చిందని..తనని తాను ఎప్పుడూ అలా ఊహించుకోలేదంది శివానీ. తాను నటిని అయినా బ్యూటీ విషయంలో చాలా సింపుల్ గా ఉంటానంది. చర్మ సంరక్షణ కోసం క్రీమలు వాటికి దూరంగా ఉంటానంది. వీలైనంత వరకూ నేచురల్ గా కనిపించడానికి ఇష్టపడతానంది. శరీరానికి కావాల్సినన్నీ నీళ్లు మాత్రం క్రమం తప్పకుండా తాగుతానంది. రాత్రి సమయంలో మాత్రం మాయిశ్చరైజర్ తప్పనిసరిగా వాడుతానంది. వారానికి ఒకసారి చర్మానికి పెసరడిండి మాత్రం రాస్తానంది. ఇక టాలీవుడ్‌లో నటీమణుల మధ్య ఎలాంటి కాంపిటీషన్ ఉందన్నది తెలిసిందే. ఒక్క ఛాన్స్ కోసం ఎంతో మంది క్యూలో ఉన్నారు. స్థానిక భామలతో పాటు ముంబై, చెన్నై, కేరళ, బెంగుళూరు ప్రాంతాల నుంచి దిగుమతి అవుతోన్న వారి సంఖ్య అంతకంతకు కనిపిస్తోంది. సాధారణంగా తెలుగు హీరోయిన్లకు అవకాశాలివ్వడానికి దర్శక, నిర్మాతలు కూడా ముందుకు రారు. స్థానిక నటులతో కొన్ని రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని భయం కూడా ఓ కారణం. వాటన్నింటిని బ్రేక్ చేసి శివానీ ఛాన్సులు అందుకుంటుంది. ఇంత వరకూ గ్లామర్ పాత్రల్లో నటించలేదు. మరి ఆ తరహా పాత్రల విషయంలో శివానీ ఎలా స్పందిస్తుందో చూడాలి.

## క్రీడా వాయిస్

# కోహ్లీ-రోహిత్ రీఎంట్రీ మరలా ఎప్పుడు..

## ఎన్ని రోజులు ఆగాలో తెలుసా..?



దేశీయ క్రికెట్‌లో వీరిద్దరి భాగస్వామ్యం వెనుక బీసీసీఐ తీసుకున్న కొత్త నిర్ణయం ఉంది. దేశీయ క్రికెట్‌లో పాల్గొనని ఆటగాళ్లకు టీమ్ ఇండియాలో చోటు దక్కదని బీసీసీఐ కొత్త నిబంధన తీసుకువచ్చింది. 2027 వన్డే ప్రపంచకప్‌లో కూడా ఆడాలని భావిస్తున్న ఈ సీనియర్ ఆటగాళ్లు, తమ ఫిట్‌నెస్, ఫామ్‌ను కొనసాగించుకోవడానికి దేశీయ క్రికెట్‌లో పాల్గొంటున్నారు. దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ 2-1 తేడాతో ఘన విజయం సాధించిన తర్వాత, స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తదుపరి ఎప్పుడు మైదానంలోకి అడుగుపెడతారనే ప్రశ్న అభిమానుల్లో మొదలైంది. వీరిద్దరి అంతర్జాతీయ షెడ్యూల్, దేశీయ క్రికెట్ ప్రణాళికలు ఇక్కడ ఉన్నాయి.

**అంతర్జాతీయ షెడ్యూల్..**

దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో వన్డేతో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు ఈ సంవత్సరం (2025) అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్ ముగిసింది.

**తదుపరి సిరీస్..**

వీరిద్దరూ ఇకపై 2026 జనవరిలో న్యూజిలాండ్‌తో జరగబోయే మూడు వన్డేల సిరీస్‌లో కలిసి కనిపించనున్నారు. మొదటి మ్యాచ్: జనవరి 11న వడోదరలో.

**మిగిలిన మ్యాచ్‌లు:** రాజ్‌కోట్, ఇండోర్‌లో జరగనున్నాయి. దక్షిణాఫ్రికా సిరీస్‌లో కోహ్లీ వరుసగా రెండు సెంచరీలు (135, 102) చేయగా, రోహిత్ 57, 75 పరుగులతో రాణించారు. అద్భుత ఫామ్‌లో ఉన్న ఈ దిగ్గజాలను మళ్ళీ మైదానంలో చూసేందుకు అభిమానులు జనవరి వరకు వేచి చూడక తప్పదు. అంతర్జాతీయ మ్యాచ్‌లకు విరామం లభించడంతో, ఈ ఇద్దరు ఆటగాళ్లు దేశీయ క్రికెట్‌లో కనిపించే అవకాశం ఉంది. ఈ నెల చివర్లో (డిసెంబర్ 2025) ప్రారంభం కానున్న విజయ్ హజారే ట్రోఫీలో రోహిత్, విరాట్ ఆడనున్నారు.

**కోహ్లీ:** ఢిల్లీ జట్టు తరపున ఆడటం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

**రోహిత్:** ముంబై తరఫున ఆడనున్నట్లు సమాచారం.

**బీసీసీఐ కొత్త నిబంధన..**

దేశీయ క్రికెట్‌లో వీరిద్దరి భాగస్వామ్యం వెనుక బీసీసీఐ తీసుకున్న కొత్త నిర్ణయం ఉంది. దేశీయ క్రికెట్‌లో పాల్గొనని ఆటగాళ్లకు టీమ్ ఇండియాలో చోటు దక్కదని బీసీసీఐ కొత్త నిబంధన తీసుకువచ్చింది. 2027 వన్డే ప్రపంచకప్‌లో కూడా ఆడాలని భావిస్తున్న ఈ సీనియర్ ఆటగాళ్లు, తమ ఫిట్‌నెస్, ఫామ్‌ను కొనసాగించుకోవడానికి దేశీయ క్రికెట్‌లో పాల్గొంటున్నారు. అందుకే, అభిమానులు జనవరి వరకు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో వీరిని చూడలేకపోయినా, ఈ నెలాఖరులో జరిగే దేశీయ టోర్నమెంట్‌లో వారి ఆటను ఆస్వాదించవచ్చు.

## ఆర్సీబీ అభిమానులకు

# అదిరిపోయే న్యూస్..

### సొంతమైదానంలోనే మ్యాచ్‌లు..



డీకే శివకుమార్ హామీ కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికల్లో ఓటు వేసిన అనంతరం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడారు. బెంగళూరు ఎప్పుడూ ఒక ప్రముఖ క్రికెట్ కేంద్రంగా ఉండాలని, ఇక్కడి నుంచి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఎక్కడికీ పోవని ఆయన హామీ ఇచ్చారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానులకు ఒక శుభవార్త. 2026 ఐపీఎల్ సీజన్‌కు సంబంధించిన ఆర్సీబీ మ్యాచ్‌లు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలోనే జరుగుతాయని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల వల్ల మ్యాచ్‌లు వేరే వేదికకు మారుతాయన్న ఆందోళన అభిమానుల్లో నెలకొంది. కానీ ఇప్పుడు డీకే శివకుమార్ హామీతో వారికి ఊరట లభించింది.

**అసలు సమస్య ఏమిటి?**

ఇటీవల బెంగళూరులో జరిగిన ఆర్సీబీ విజయ ఉత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో, జస్టిస్ జాన్ మైకేల్ కున్హా నేతృత్వంలోని కమిటీ ఈ స్టేడియం భారీ కార్యక్రమాలకు సురక్షితం కాదని నివేదిక ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. దీంతో భద్రతా కారణాల రీత్యా 2026 ఐపీఎల్ మ్యాచ్‌లను బెంగళూరు నుంచి పూణేకు మార్చే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. డీకే శివకుమార్ హామీ కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ న్నికల్లో ఓటు వేసిన అనంతరం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడారు. బెంగళూరు ఎప్పుడూ ఒక ప్రముఖ క్రికెట్ కేంద్రంగా ఉండాలని, ఇక్కడి నుంచి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఎక్కడికీ పోవని ఆయన హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం: స్టేడియంకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, చట్టపరమైన పరిమితులకు లోబడి, సరైన క్రౌడ్ మేనేజ్‌మెంట్‌తో స్టేడియాన్ని వినియోగిస్తామని చెప్పారు. క్రికెట్ ప్రేమికుడిగా..: "నేను ఒక క్రికెట్ ప్రేమికుడిని. ఆర్సీబీ మన గర్వకారణం. అన్ని సమస్యలను సరిచేసి 2026 ఐపీఎల్ మ్యాచ్‌లు చిన్నస్వామి స్టేడియంలోనే జరిగేలా చూస్తాను" అని ఆయన భరోసా ఇచ్చారు. కొత్త స్టేడియం ప్రస్తావన భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా ఉండటానికి, నగరంలో మరో పెద్ద స్టేడియం నిర్మించే ఆలోచనలో ఉన్నట్లు కూడా డీకే శివకుమార్ పేర్కొన్నారు. మొత్తానికి, డీకే శివకుమార్ ప్రకటనతో ఆర్సీబీ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. వచ్చే ఐపీఎల్ సీజన్‌లో కూడా తమ సొంత మైదానంలోనే మ్యాచ్‌లను వీక్షించే అవకాశం వారికి దక్కనుంది.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
సినీ వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com